
అప్పనపల్లి

శ్రీబాలాజీచరిత్రము



కృతికర్త

మెండా చిన సీతారామయ్య ఎమ్.ఏ.

ఆంధ్రోపన్యాసకుడు (రిటైర్డు)

ధవళేశ్వరము.

శ్రీరస్తు


ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

ఓం నమో వాసుదేవాయ ఓం నమో నారాయణాయ

ఓం నమో వేంకటేశాయ ఓం నమో బాలబాలాజి దేవాయ

అప్పనపల్లి

శ్రీ బాలబాలాజీ చరిత్రము



శ్రీకరంబులు సంసార సింధుతార
కములు సంతోష సంవర్ధకములు వృజిన
విపిన వీతిహోత్రములు శ్రీవేంకటేశ
చరణ రాజీవములు మాకు శరణ మగుత.

THIS BOOK IS PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF TIRUMALA TIRUPATI DEVASTHANAMS UNDER THEIR SCHEME "AID TO PUBLISH RELIGIOUS BOOKS"

కృతికర్త

మెండా చిన సీతారామయ్య ఎమ్.ఎ.

ఆంధ్రోపన్యాసకుఁడు (రిటైర్డు)
ధవళేశ్వరము.

ప్రథమ ముద్రణ : మార్చి 1997

ప్రతులు : 750

మూల్యము : రు. 30-00/ లు

ముద్రణ :

విజయశ్రీ ప్రెస్

కందకం రోడ్డు రాజమహేంద్రవరము - 1.

ప్రాప్తిస్థానము :-


మెండా చిన సీతారామయ్య, ఎమ్.ఏ.

తెలుగు లెక్చరర్ (రిటైర్డు)

'శ్రీనికేతన్' సాధనాలవారి వీధి

ధవళేశ్వరము - 533 125

తూర్పుగోదావరి జిల్లా.



కృతిభర్త



కృతికర్త

జ్ఞానబ్రహ్మ, ఆర్షవిద్యావాచస్పతి
శ్రీశ్రీశ్రీ స్వామి సుందరచైతన్యానంద
ధవళేశ్వరము

-: ప్రహర్షోక్తి :-

" ఏకః స్వాదు న భుంజీత "

రుచిగల పదార్థమును ఒకరే భుజించకూడదు అని ఆర్యోక్తి. పుణ్యఫలవిశేషంగా లభించిన భవ్యకవితావేశాన్ని, దివ్యభగవ ద్భక్తిని పదుగురితో పంచుకోవాలని మహర్షుల హితోక్తి. సూక్తి స్ఫూర్తి నిచ్చి నపుడే బ్రతుకులో దీప్తి. ఈవిధమైనదీప్తి చైతన్యంలో నిండుగ, దండిగ తడిసిన వారే శ్రీ మెండా చినసీతారామయ్య.

అధ్యాపకవృత్తిని విరమించి ఆధ్యాత్మిక ప్రవృత్తిలో రమిస్తున్న శ్రీమెండా రసాప్లుతములైన పద్యములను రచించుటలో ఎగుర వేసిన జెండా. పద్యవిద్యలో ఆరితేరిన సీతారామయ్యగారు విద్వన్మ నోహరంగా, ఉన్నత భావస్ఫోరకంగా రచించిన పద్యకావ్యమే ఈ "బాలబాలాజీ చతుశ్శతి". భగవత్కృపావిశేషంతో సాగిన భావ తరంగ స్రవంతి.

ఇదొక దివ్యమైన ఆరాధన. అందించేవాడు 'చిన'సీతారామయ్య అందుకొనేవాడు 'బాల' బాలాజీ. ఒకవిధంగా చెప్పాలంటే ఇదొక బాలకాండ. పిల్లలబాట. నిష్కల్మషమైన పాట. నిరాడంబరమైనఆట. గ్రంథ నామమువలె గ్రంథవిషయంలో కూడ సుస్పష్టంగా ద్యోతక మవుతుంది ప్రహ్లాద బాలభక్త్యావేశం.

చిన్నిబిడ్డడు తప్పులు చేసె నేని
తండ్రి మన్నించు భంగి సంతతము నేను

జేయు దోషవ్రజము నుపేక్షింపుమయ్య

బాలబాలాజి! అప్పనపల్లిదేవ!

అని 291 వ పద్యములో అరవై (60) నిండిన సీతారామయ్య శూన్యాన్ని తొలగించుకొని, షడ్గుణైశ్వర్య సంపన్నుడైన కళ్యాణ శ్రీనివాసుని ఆరురుక్షువై అర్థించాడు. ఆరాధించాడు.

అమ్మకంకాని వస్తువులను తయారుచేయుటకు ఎవ్వరూ ముందుకురారు. పద్యకవితా వైభవము తెరమరుగవుతున్న రోజులివి. వచన, గేయరచనల ప్రాముఖ్యము పెరిగి, పద్య ప్రాభవము సన్నగిల్లు తున్న ఈ రోజుల్లో మెత్తదనాన్ని సంతరించుకొని నాల్కలపై నిలిచే పద్యాలకు అమ్మకం తగ్గదని నమ్మకమున్న వ్యక్తి శ్రీసీతారామయ్య. పద్యవిద్యకు కావలసిన పాటవమంతా ఈ కవికి కలదని ఋజువు చేస్తుంది. ఈ చతుశ్శతి మచ్చుకు ఒక మాణిక్యమును చూడండి.

కనకమయచేల! ముకురసంకాశరమ్య

భాసురకపోల! గాయక భక్తగాన

లోల! కాయకాంతి జితేంద్ర నీలజాల!

బాలబాలాజి! అప్పనపల్లిదేవ!

కవికి ప్రధానంగా ఉండవలసిన లక్షణాలు రెండు. అవి (1) శక్తి (2) వ్యుత్పత్తి. వస్తువును ఎన్నుకోవడం ఇక్కడ శక్తి అయితే, ఎన్నుకొనిన విషయానికి శబ్దార్థాలనురసవత్తరంగాసమకూర్చి వింగ డించడం వ్యుత్పత్తి. ఈ రెండు సమతూకంలో సమరసమైనపుడు కవిత రసస్ఫూర్తితో రంజిల్లడమేగాక ధ్వన్యాత్మకంగా శోభిస్తుంది. ఇక్కడే కవిత. ప్రియహిత కళ్యాణాత్మక కావ్యంగా గోచరిస్తుంది.

ప్రియమైనమాట హితం కాకపోవచ్చు. హితమైనమాట ప్రియంగా తోచకపోవచ్చు. ఈ రెండూ కలిస్తేనే సుకవితాదర్శనం.

హితం మనోహారి చ దుర్లభంవచః ఈరెండూ దుర్లభము లని పెద్దలమాట. కానీ సీతారామయ్యకు ఆ రెండూ సులభంగా దొరికాయి లేకపోతే, ఈ పద్యమెలా వస్తుంది.

షడ్రసోపేతమైన భోజనమునీకుఁ
గూర్చఁగా లేనుగాని, నాకూర్మివంతు
కంబుఁదినిపింతు భక్తిదుగ్ధంబుతోడ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ!

భక్తిని వ్యక్తముచేయు ఈ కావ్యము హితమైనది. శిరీష సుకుమారములైన పద్యసుమములతో తయారైన ఈ స్ఫురణోజ్జ్వల భావ రత్నమాలిక ప్రియాతిప్రియంగా గోచరిస్తూఉండడం గొప్పవిశేషం. ప్రియాన్ని కోరేవారికి పీరిపద్యములు ఉత్తుంగతరంగాలు. హితాన్ని చూచేవారికి సాగరాంతర్గతమైన ఆణిముత్యాలు.

ఈ ప్రపంచంలో జరిగేదంతా నాటకం. వీక్షించుటే మనపాటవం నీరు లోతుగా ఉంటే నావ సుఖంగా పయనిస్తుంది. భావగాంభీర్యము గల వానికి బ్రతుకు శుభంగా సాగుతుంది. ఇదంతా భక్తితోనే సాధ్యపడుతుంది. అందుచేతనే నారదమునీంద్రుడు భక్తిసూత్రాలలో

త్రిసత్యస్య భక్తిరేవ గరీయసీ భక్తిరేవ గరీయసీ

త్రికాలములలో మార్పునెరుగని భగవంతుని యందుగల భక్తియే శ్రేష్ఠమైనది. అని తెలిపినాడు.

బ్రతుకులోని సంపదలన్నీ నీటి బుడగలే. మానవునికి నేడున్నది రేపు ఉంటుందని చెప్పలేము. నేటిని వినియోగించుకొన్నవాడే మేటిగా నిలుస్తాడు. సాటిలేని వాడనిపించుకుంటాడు. నేటినిపోగొట్టుకుంటే అన్యాయంగా ఏటికి ఆహుతి అవుతాడు.

భవసాగరము అగాధమైనది. దానిలోతును కనుగొన్నవారు లేరు. అదొకమాయాజాలము. భయంకరమైన సుడిగుండము, భగవచ్ఛ

రణారవిందమును ఆశ్రయించుట కన్నా దానినుండి బయటు పడుటకు మరొక మార్గములేదు.

సంసారార్ణవ మగ్నానాం విషయాక్రాన్తచేతసామ్!

విష్ణుపోతం వినానాన్యత్కించి దస్తి పరాయణమ్!"

విషయసంసర్గదోషయుతమైన మనసును కలిగి సంసార సాగరములో మునిగిపోవువారికి భగవద్భక్తి అనెడి నావతప్ప, దానిని దాటుటకు మరొక ఉపాయములేదు. అందుచేతనే

భక్తిరేవ పరమార్థదాయినీ భక్తిరేవ భవరోగనాశినీ

"పరమాత్మ సంబంధమైన జ్ఞానమును అనుగ్రహించేది,భవరోగాన్ని నశింప చేసేది భక్తి ఒక్కటే" అని శాస్త్రప్రబోధము.

ముక్తి మార్గములలో శ్రేష్ఠమైన భక్తిని జనావళి హృదయ క్షేత్రాలలో నిక్షిప్తంచేసే కావ్యాన్ని రచించిన సీతారామయ్యగారు ధన్యులు.

ఈ భక్తిపద్యాల పొత్తములో భక్తితోపాటు భావసామ్యత, మానవతాస్పృహ సామాజికస్పందన చోటుచేసుకొని ఉండడం గమనార్హం.

"అప్పనపల్లి బాలాబాలాజి చతుశ్శతి" అనెడి ఈపద్యకావ్యము లలితమైన శైలిలో రచింపబడిన ఉత్తమ గ్రంథము అని నా అభిప్రాయము.

భక్తిభావయుతమైన ఇట్టి మహత్తర కృతులను మరిన్ని రచించి మానవాళికి మహోపకారం చేయగలరనే ఆకాంక్షతో శ్రీ చినసీతారామయ్యను అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

ఆశ్రమం
7-12-95

బుధజన విధేయుడు
స్వామి సుందరచైతన్యానంద

శ్రీ మద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులు
ఉభయవేదంతాచార్య పీఠాధిపతులు,
వేదవిశ్వవిద్యాలయ స్థాపకులు,
శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు

రాజమహేంద్రవరము
4-1-96

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామిజీవారి

అనుగ్రహ భాషణము

శ్రీ మతే నారాయణాయనమః

అనేక మంగళా శాసనములతో శ్రీమాన్ మెండా సీతారామయ్య గారు వ్రాసిన 'అప్పనపల్లిదేవ' చతుశ్శతి చూచినాము భాషబాగున్నది. భావము ధర్మ్యము. భాషాకావ్యచ్ఛందో లక్షణములుఏమియూకొరత పడలేదు. కవిత పూర్వజన్మ సుకృతముచేత అలవడుచుండును. శక్తి, నిపుణత, అభ్యాసములచే అవి వన్నెకెక్కును. కళలన్నియు సహజముగా రావలసినవియేకాని ఆహార్యములుకావు.

శ్రీమాన్ సీతారామయ్యగారు తెలుగులో M.A. పట్టాను అందుకొన్నారు. సంస్కృతమున గట్టి పరిచయము ఉన్నవారు. ఉభయ భాషావాఙ్మయములలోతులు తెలిసినవారు. విషయమువారు చెబితే కాక వారి గ్రంథపరిశీలనముద్వారా మాకు కలిగిన అభిప్రాయము. వారి శ్రీవేంకటేశ సుప్రభాతానువాదమునూ పరిశీలించితిమి. భగవంతుడు ఇచ్చిన ఈ కవితా కళను శ్రీమాన్ సీతారామయ్యగారు భగవంతుని స్వరూప రూప, గుణ, విభూతులను లోకమునకు విశద. పరచ ప్రయత్నించిరి. వీరి ప్రయత్నము మాకు మిక్కిలి ప్రమోదమును కల్గించినది. వారింకను ఇట్టిగ్రంథములను రచించ గల్గినశక్తి యుక్తులను ఆయురారోగ్యాదులను ఆ కలియుగదైవము శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించుగాక!

చిన్నజీయరుస్వామి

ప్రవచన శిరోమణి: శ్రీ ఉ. వే. శ్ర
శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులు

ఆమోద ప్రకాశము

శ్రీ మెండా చినసీతారామయ్యగారి జీవితము ధన్యమగునట్లు శ్రీఅప్పనపల్లి బాలబాలాజి తనయనుగ్రహమును వారిపై ప్రసరింపజేసి తనపై చతుశ్కృతి పల్కించినాడు. జన్మాంతరసుకృత పరిపాకముచే కవిత్వమబ్బినను భగవదనుగ్రహము లేనిదే భక్తి కలుగదు. మనగోని రేగుపండ్లకును మౌక్తికముల్ వెలవోసినట్లు, తమ కవిత్వమును భగవధితరములకు వినియోగింపకుండుట మహాభాగ్యము. భగవత్కథల యందు రుచికల్గి వాక్కును సద్వినియోగ పరచు కొనిన పుణ్యశాలి శ్రీ సీతారామయ్యగారు.

"యే యథామాంప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్"

అని నాడు భగవానుడు. నిర్గుణమగు బ్రహ్మమే సగుణము సాకారమునై రామకృష్ణాది రూపములతో వెలసి అంతర్యామియై ఉపాస్యమై అర్చామూర్తియై సర్వజనసంసేవ్యమైనది. పూర్ణమైన తత్త్వమే సులభమైనది. ఆ అర్చామూర్తినే సేవించి తరించినారు మన పూర్వులు. ఆ మార్గముననే శ్రీ సీతారామయ్య పావనగౌతమీ తీరవాసియగు శ్రీ బాలాజీని తమ కృతిపుష్పములతో అర్చించినారు.

భక్తి సహజముగా రావలెను. కవిత్వముకూడ సహజమై దానితో చేరినచో బంగారమునకు పరిమళమబ్బినట్లే. వీరి కవితా ధార సహజము. ఎచ్చటను అతుకు కనబడదు. నడకలో ధారాళత కన్పట్టును. అదే వారి మానసిక భావనా వైశద్యమునకు నిదర్శనము.

సంస్కృత సమాసము నడచునపుడు కుంటు పడకుండ తీగ సాగినట్లు సాగుట చాల మనోహరము.

దైత్యసందోహకాంతార దావదహన!
దురిత సంతమసచ్ఛటాద్యుమణితేజ!
అనునవి ప్రసన్నగంభీర మధురమ్ములు.

భక్తి ఫలమును కోరదు. విశ్రమించదు. మరొకవైపు పోనిచ్చగింపదు. కులశేఖరులు మానస రాజహంసమును కృష్ణపదపంకజ పంజరాంతరమున బంధింప ప్రార్థించినారు. సీతారామయ్యగారు తమభక్తి దీపమారకుండ స్వామికరపుటాచ్ఛాదనము చేయగోరినారు. ఎంతనిశ్చలమైన భక్తియో.

తనకొక ఫలమును కోరక స్వామికి తమ హృదయమున విశ్రాంతి కల్పింప యత్నించుట పరమభక్తి.

శ్రమము నొందితివేమొ శశ్వద్విలాస!
సృష్టిరక్షాభరంబు వహించినీవు
సేదదీరు మొకింత నా చిత్తశయ్య
అని కోరినారు

కోరకుండుట మాత్రమే కాదు. కులశేఖరులు
"నాస్థాధర్మేన వసునిచయే" అనినట్లు
వలదు సుసద్మసౌఖ్యముల్ వలదు భోగ
భాగ్యచయము అనినారు. ఇదివైరాగ్యము.
అంతేకాదు

కోర్కెలను దీర్పుమని నిన్ను గోరబోను
సుంతదయజూప నిన్ను బ్రార్థింతు ననినారు
ఎంతటి అనన్యభక్తియో చూడుడు

జీవపరమాత్మల కుండు సంబంధము నెఱుంగుటయే జ్ఞాన సారము.

జీవుడను నేను పరమాత్మ వీవు కింక
రుండ నేను జగద్వల్లభుండవీవు
అని జ్ఞానము నావిష్కరించినారు.

వీరు కోరుకొనునవి అందరును కోరదగినవే
కర్మానుగుణముగ వచ్చువానిని కోరనక్కరలేదు
భగవదనుగ్రహము చేతనే రావలసిన వానినేకోరినారు
"ఆత్మనిగ్రహశక్తి సత్యానురక్తి
విమలతరభక్తి, మధురోక్తి"
ఈ నాలుగు లభించుట ఎంతభాగ్యమోకదా!

సహజభక్తితో పల్కులు వచ్చుటచే యతులుప్రాసల కొఱకు ప్రయాసపడక సురధునీ సన్నిభంగా సాగినది వీరి చతుశ్శతి.

భగవత్కటాక్షప్రసారరుచి నెరింగిన మహనీయులు సీతారామయ్యగారు. భగవద్దృష్టి పాత్రములోఉండే చల్లదనాన్ని
పండు వెన్నెలకంటె సౌపర్వనిమ్న
గాజలముకంటె మిహికానగంబుకంటె

చల్లనైనదన్నారు. అనుభవించిన వారుకాని ఆవిష్కరించ లేని భావమిది.

వీరిభక్తికి సంతసించి బాలాజీ వీరి
పెరటిలోన నీవులమ్రాను వెలసినట్లు
వెలసినాడు. వెలిమొదవు చేరువకువచ్చి
నిలిచినట్లు నిలిచినాడు

జీవితము రిక్తము, వ్యర్థము కాకుండ కాపాడినాడు. ధన్యజీవనులు శ్రీసీతారామయ్యగారు. వీరు శ్రీనివాసకృపా పాత్రులై ఇంకను సరసమధురభక్తిరసమయ కావ్యములను గ్రథించి ఆంధ్రలోకమును ధన్యమొనర్చి వారుధన్యత నొందునట్లు అప్పనపల్లి బాలబాలాజి అనుగ్రహించుగాక.

14-11-95
సీతానగర్, విశాఖపట్టణం-12

—శ్రీ అప్పలాచార్యులు

భారతాచార్య
డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు
ఎం. ఏ, పి. హెచ్. డి.

మేలి పలుకు

ఇది శ్రీ మెండా చిన సీతారామయ్యగారి లేఖిని నుండి జాలు వారిన భక్తి కవితా ప్రవాహము. నన్నూఱు గీత పద్యములలో సాగిన పద్యకవితా పూత గౌతమీస్రోతస్విని యే యిది.

శ్రీ సీతారామయ్యగారు నాకుఁ జిరకాలముగా నాప్తమిత్రులు. మాకుఁగలయా పరస్పరాప్తతయే వారు నన్నుఁ దమ యీ మహాకావ్యమునకుఁ బీఠిక వ్రాయమనుటకును, నేను వ్రాయుటకును గారణము.

వీరిది వఱకెన్నియో కావ్య ఖండికలను రచించి 'తేనెవాఁక'లను సార్థక నామముతోఁ బ్రచురించియుండిరి. ఇటీవల వయోధర్మమును బట్టి సహజముగా నేర్పడు నాధ్యాత్మిక భావసంపదతోఁ దిరుమల వాసుని సుప్రభాతమును దేట గీతులలో నాంధ్రీకరించి శ్రీవారి పాద పద్మములకే సమర్పించి యుండిరి. ఇప్పు డప్పన పల్లిలో వేంచేసి యున్న శ్రీబాల బాలాజీ స్వామివారి శ్రీచరణారవిందముల విమల భక్తి పురస్సరముగా సమర్పించిన మలిపుష్పమిది.

ఈ చతుశ్శతిలో నే పద్యమును బట్టి చూచినను వీరి వినిర్మల భక్తిరసము తొనికిసలాడు చుండును. వీరి హృదయమెంత మధురమో, వీరి కవితాశయ్యయునంత మధురము అది యెంత నిర్దుష్టమో యిదియు నంత దోషవర్జితము.

అది యెంత ప్రసన్నమో, యిదియు నంత ప్రసాదగుణభాసురము. పద్య శిల్పమెఱిగిన నిపుణులు వీరు.

వీరి సమాసములు కమ్మచ్చున లాగిన బంగరుఁదీఁగలవలె మనోహరముగా సాగును. మచ్చునకుఁ గొన్ని

కనకమయచేల ! ముకురసంకాశరమ్య
భాసురకపోల! గాయక భక్తగాన
లోల! కాయకాంతి జితేంద్రనీలజాల!

ఈ పద్యము నందలి యంత్యానుప్రాసములప్రయత్నసిద్ధములై యతిమనోహరములై పోతన్నగారి హృద్యపద్యశయ్యను దలఁపించుచున్నవి.
యీ పద్యమును జూడుఁడు.

రామ! రఘురామ! జగదభిరామ! దనుజ
రాజ దుర్వార గర్వవిరామ! భవమ
హోబ్ధితారకనామ! భద్రాద్రిధామ!

ఈ సమాసము లెంత లలితలలితములు. ఎంత యక్లిష్టముగా సాగినవి! అవి యక్లిష్టములై పఠనమాత్రమునఁ బాఠకుల మనః క్లేశములను దొలగించి హాయిని జేకూర్చునవిగా నున్నవి.

అంబురుహపత్రనేత్ర! సంయమి వరేణ్య
మానసారామ చైత్ర! రమా కళత్ర!
దురితవల్లిలవిత్ర! సాధుజనమిత్ర!

ఇట్లెన్నియని యుదాహరించుట ! అవనికి దొరఁకొన్నచో మొత్తము పద్యముల నన్నిటి నుదాహరింపవలసి యుండును.

వీరు సంస్కృత సమాసముల నెంత హృద్యముగా ఘటింతురో, తెలుఁగు పలుకుబడులను గూడ నంత సద్యోహృదయనైవేద్యముగా ఘటింపగలరు. చూడుఁడు.

మిసిమి తొలికారు మబ్బుల మేలమాడు
నీలదేహముతోడ మాౝమోల నిలిచి

కనుల విందొనగూర్చుము కాంక్షతీఱ
పచ్చవిలుకాని తల్లికిఁ బంటవలెఁతి
కొక్కరూపునఁ బొలయుల్కఁ జక్కదిద్దు
చతుర రసికునిగా నిన్ను స్తుతులొనర్తు
కనులఁ గూరుకురాదు నెమ్మనము సతముఁ
బ్రాణభీతిని నూయెల పగిదినూఁగు
నెటులఁ గరుణించి ప్రోతువో యింకనన్ను
పెరటిలోన నీవుల బ్రమాను వెలసినట్లు
వెలిమొదవు చేరువకు వచ్చి నిలిచి నట్లు
ఎదురు దెబ్బలు తప్ప నా బ్రదుకులోన
వీసమెత్తు సౌఖ్య మనుభవింప నైతి
నుడుకుఁగన్నీరు దుడువ రావోయి వరద!

కొన్ని పద్యములు క్షీరనీర న్యాయమునఁ దత్సమాచ్ఛికపద మిశ్రములై వీరి యుభయ భాషా పాండితికి నికషములై యలరారు చుండును.

ఆశలను కందిరీఁగ లీ యంతరంగ
కోటరము జొచ్చి నిరతమారాటపెట్ట
శ్రమముఁ బొందెడు నాకు స్వాస్థ్యమ్ము నిమ్ము
ఆజవంజవ పాథోధి యందు మున్గి
కొట్టు మిట్టాడు నన్నుఁ జీకొట్టకుండఁ
దావక కటాక్షనౌకతోఁ గావుమయ్య

శబ్దముపై వీరి కెంతటి యధికారము గలదో భావావిష్కరణ మునందును వీరి కంతటి నైపుణ్యము గలదు. పెక్కుపద్యము లుపమా రూపకాలంకార భూషితములై భావమరందమును సుకుమారముగాఁ బఠితల హృదయ పాత్రములకుఁ జూఱలిచ్చు చుండును.

ఎట్టి క్లేశములైన నిన్నెంచఁగానె
వెలుతురును జూచి చీఁకటి తొలఁగురీతిఁ
బంచ బంగాళమై వేగఁ బరుగుఁదీయు

ఈ పద్యము నందలి యుపమ భగవత్స్మరణ మాత్రమున భక్తుల క్లేశములు పటాపంచలగు వేగమును సూచించుచున్నది.

చూపులు చకోరకంబులై చుట్టుముట్టి
యుష్మదీయాస్య చంద్రపీయూషపాన
పారవశ్యాన నిరతంబుఁ బర్వులెత్తు

ఇందలి రూపకము భగవద్దర్శన భాగ్య ప్రాప్తికై యీకవి పడు తహతహను వ్యక్తీకరించుచున్నది.

నియమ బద్ధత నిన్ను ధ్యానింపలేను
స్పష్టముగ నీదు కీర్తనల్ పాడలేను
వేదశాస్త్రవైదుష్య మబ్బినది లేదు.
విదిత తీర్థ దర్శనము చుక్కెదురునాకు
ఎంతటి 'నిజాయితీ! ఏమి నిరహంకారత!

భగవంతుని మూర్తిని బఠితలకు సాక్షాత్కరింపఁ జేయుటలో వీరి యప్రతిమాన ప్రతిభావిశేషము తెలియుచున్నది. స్తోత్రలహరి లోని యీ క్రింది పద్యమును దిలకింపుఁడు.

నీరదశక్రనీల రమణీయ తనూవిభవమ్ముతోడ, వి
స్ఫారవిలోచనాబ్జ విలసత్కరుణామధువృష్టితోడఁ జాం
ద్రీరుచిరాభ సుందర వినిర్మల హాసముతోడ, భక్తమం
దార! ముకుంద! నీ మధురదర్శన భాగ్యమొసంగవేఁడెదన్

ఈ చతుశ్శతిని వీరు స్తోత్రలహరి, శ్రీస్వామి సంకీర్తనము, అప్పనపల్లి క్షేత్రవైభవము, ఆత్మ నివేదనము, శ్రీరామావతారలీలలు, శ్రీకృష్ణావతారలీలలు సామాజికస్పృహ, దశావతారవర్ణనము।

కృతికర్తృవిషయాదికము, ఫలశ్రుతియని దశవిధములుగా విభజించియున్నారు.

స్తోత్రలహరిలో భగవంతునితోఁ గొన్ని మాటలను ముఖాముఖి పలుకుచు నిజమనోరథము నిట్లు నివేదించు కొనినారు.

నీవె మదీయ మానసవనీరుచిమన్మథు మూర్తివంచు సం
భావనచేసి, మోహకర మంగళరూప! త్వదీయపాదసే
వావిని బద్ధబుద్ధి ననవద్య సుఖప్రద ముక్తిభద్ర దం
తావళ కుంభపీఠి, సముదాత్త గతిం జరియింప నెంచెదన్

సర్వముముక్షుజనసాధారణమైన కోరికయే యిది. దానిని జెప్పిన తీరులో నున్నది సొగసంతయు.

శ్రీస్వామి సంకీర్తనములో స్వామి ననేక విధములుగా సంబోధించుట కాన నగును ఎంత సంబోధించినను వీరికిఁ దృప్తిలేదు. అవి యన్నియు నంత్యప్రాస విలసితములై, సమీచీనాలంకారశోభితములై యలరారుచున్నవి. మచ్చునకుఁగొన్ని

శ్రుతి శిఖావతంస పవిత్ర సుందరాంఘ్రి
పల్లవద్వయ! ప్రణవరూప ప్రభావి
తాఖిలాండ కోటి ద్రుహిణాండనిచయ!
నిర్వికార నిరంజన నిర్వికల్ప
నిరుపమాన నిరామయ నిర్విశేష
నిష్కళంక నిరాకార నిర్నిరోధ

స్వామిని వర్ణించుచు నాయనకుఁ బ్రయోగించిన విశేషణములను జూడుడు.

చిద్గగన విస్ఫురద్రమ్య శీతరోచి!
రాధికా వరవర్ణినీ ప్రణయచూత
పల్లవాస్వాదనోన్మత్త పరభృతంబ!

లక్ష్మీకుచాగ్ర
మృగమదామోద పులకితమేచకాంగ

ఇవి యన్నియు గీర్వాణభాషలోనున్న శ్రీవారి సుప్రభాత పంక్తులను దలఁపించుచు, వీరి వినిర్మలభక్తిమత్త్వమును జాటు చున్నవి.

ఆత్మనివేదనములో నీ కవివరేణ్యుని పశ్చాత్తప్తహృదయా విష్కరణము జరగి యగ్నితప్తకాంచనమువలెఁ దన్నిష్కళంకతను బ్రకటించు చున్నది. ఈ పంక్తుల నారయుఁడు.

బ్రతుకుఁ దార్తీయ పురుషార్థపరముఁజేసి
జీవితచరమాంకమున నిన్ జేరినాఁడ
వ్యసనపరతంత్రు మన్నింపుమయ్య నన్ను

అస్తినాస్తి సంశయముతో నలమటించి
తావకనిగూఢ పరతత్త్వ తంత్రమేమొ
కానలేని శాలినునన్ గావుమయ్య!

భవదపారసేవాసరోవరమునందు
జలకమాడఁదలంచు నస్మన్మనోమ
రాళమపవర్గరమ్యహర్మ్యమును బొంద

వీరు శ్రీరామావతార లీలలలో రామాయణము నందలి ప్రధాన ఘట్టములను, శ్రీకృష్ణావతార లీలలలో శ్రీకృష్ణుని చరిత్రయందలి ముఖ్యఘట్టములను వర్ణించి రామాయణ భాగవత కావ్యములను బఠి తల కందించినారు.

సామాజిక స్పృహలో వీరు నేఁటి సమాజము నల్లకల్లోలపఱచు వర్ణవ్యవస్థను, అస్పృశ్యతను, రాజకీయ కుహనానాయకుల స్వార్థపూ

రీత వంచనా శిల్పమును, వరశుల్కదురాచారమును నిరసించిన తీరు ప్రశంసనీయమై వారి సంఘ సంస్కరణాభిలాషమును వ్యక్తముచేయు చున్నది.

తరువాత దశావతారములను గూడ వర్ణించి, బాలబాలాజి! అప్పనపల్లిదేవ! యను మకుటమును బెట్టి యీ కవి శతకలక్షణమును సంపూర్ణముగా నంతరించెను.

"పూజ్యపాదుఁడు బమ్మెర పోతరాజ
సత్కవియెనాకు మార్గదర్శకుఁడుగాఁగ
భవజలధి దాఁటు నీకృతి వ్రాసినాఁడ ననియుఁ

దాను 'సరససాహితీస్వర్ణ సౌధాగ్రసంచరిష్ణుఁడ' ననియుఁజెప్పు కొనిన మాట సర్వథా సత్యము.

బమ్మెరపోతరాజు కృతియగు భాగవతమువలె నీకృతియు జగద్ధిత సంవర్ధకమై, యాయనకువలె నీయనకును జిరయశస్సంపాదకమై యీకృతి తనరుగాతమని యాకాంక్షించుచున్నాను.

రాజమహేంద్రవరము
8-8-95

జొన్నలగడ్డ మృత్యుంజయరావు

(o)—(o)

ప వ్యా గ్ద ర్శ న ము

శ్రీలు చెలువాఱు తెలుఁగునాట తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నో పుణ్యక్షేత్రములు వెల్లి విరిసినవి. దైవ దర్శనమునకు నిలువు టద్దము లనదగిన యీ క్షేత్రములలో రాజమహేంద్రవరము, దక్షారామము, కోటిపల్లి, అంతర్వేది, అన్నవరము; మున్నగునవి ప్రాచీన కాలమునుండి పేరెన్నిక గాంచినవి.

కోనసీమకుఁ జెందిన మామిడికుదురు మండలములోని అప్పనపల్లి యను గ్రామము ఇటీవల వెలుగులోనికి వచ్చిన దివ్యతీర్థము. సచ్చిదానంద స్వరూపుడు కల్యాణ గుణధాముడు, భక్తజన వరదుఁడు నైన తిరుపతి వేంకటేశ్వరుఁడు తన తేజోరూపమున శ్రీ బాల బాలాజీ యను పేర నిచ్చట వెలసి ఆబాలగోపాలమునకు ఆరాధ్యదైవమైనాడు. పతిత పావనియగు గోదావరీనదీమతల్లి యేడు పాయలుగఁ జీలఁగ, అందొక పాయ వైనతేయ నదిగా, ఉత్తర దిశాభిముఖముగా, ఈ గ్రామము నొరసి ప్రవహించుచు తూర్పు సముద్రములో సంగమించుచున్నది. ఈ తీరున దైవప్రాధాన్యము, నదీ ప్రాధాన్యము కలిగిన అప్పనపల్లి తీర్థనామమును సార్థక మొనరించుకొని, పురాతన పుణ్య క్షేత్రములకు దీటుగా తనరారుచున్నది.

అందాల హరివిల్లు పఱచుకొన్న చందాన కనువిందుగూర్చెడు కొబ్బెర అరటి తోటల నడుమ నెలకొనియున్న యీ తీర్థము పాలకడలిని ప్రభవించిన పున్నమ జాబిల్లివలె భక్తజనబృందమునకు దర్శనీయమై హృదయానంద మొదవించు చున్నది. కోరిన వారికి కొంగు బంగారమై, పేదలపాలిటి పెరటి కల్పకమై విలసిల్లెడి శ్రీ స్వామివారిని సేవించుటకు నలుగడలనుండి తండోపతండములుగ జనులు విచ్చేయు చున్నారు. వేకువజాముననే లేచి, చల్లని పిల్ల

తెమ్మెరల మృదుస్పర్శతో మేనులు పులకింపగా ఉత్తరవాహినిలో, అఘమర్షణ స్నానమాచరించి, దివ్యమంగళ విగ్రహుండైన దేవదేవుని దర్శించి వారు ధన్యజీవను లగుచున్నారు.

ఈ నాడిట్టి వైభవ ప్రాభవములతో తులతూగుచున్న అప్పన పల్లి అనాదిగా జనసంచారమునకు నోచుకోని అరణ్యప్రాంతము. అప్పన్న యను బాలుడు సర్వసంగపరిత్యాగియై తపముచేసి సర్వే శ్వరునిలో సమైక్యము పొందిన నాటినుండి యీ ప్రాంతము అతనిపేర అప్పనపల్లిగా జనవ్యవహారమున రూఢికెక్కినదని స్థల పురాణవేత్తల మాటలను బట్టి తెలియుచున్నది.

"కలౌ వేంకట నాయకః' అని ప్రసిద్ధిగాంచిన శ్రీమన్నా రాయణుడు అప్పనపల్లిలో వెలయుటకు ముఖ్య కారకులు శ్రీ మొల్లేటి రామస్వామిగారు. వృత్తినిబట్టి ఆయన కొబ్బరి వర్తకుడు. ప్రవృత్తిని బట్టి పరమభాగవతోత్తముడు. ఆయన ఒక శుభదినమున సప్తగిరీ శుని సందర్శించుటకు వెళ్ళి తనకు స్వామి అనుగ్రహ విశేషముచే వ్యాపారములో లభ్యమైన లాభములో కొంత భాగమును స్వయ ముగా ఆ శ్రీనివాసుని దివ్యచరణారవింద సన్నిధానమున కానుక రూపమున సమర్పించుటకు యత్నింపగా, ఏలొకో ఆలయార్చకులు సమ్మతింప లేదట. దానికి తీవ్రమనస్తాపము చెందిన శ్రీరామస్వామి తన యిలవేల్పు కోనేటి రాయుని తలపోయుచు నిద్రింపగా ఆ యఖి లాండకోటి బ్రహ్మాండ నాయకుం డాయనకు స్వప్నమున సాక్షాత్క రించి, తన్ను శ్రీ బాల బాలాజీగా అప్పనపల్లిలో ప్రతిష్ఠించి, నిత్య ధూప దీపనైవేద్యాదులు కొనసాగంజేసి తరింపుమని సెలవిచ్చెనట. ఆ రీతిగా శ్రియఃపతి కోరిక మేరకు శ్రీరామస్వామి నారికేళ వృక్షసము దాయముతో ప్రకృతిరామణీయకమునకు పట్టుగొమ్మయైన అప్పన పల్లిలో ఆ విశ్వంభరుని ప్రతిష్ఠింపంజేసి విశ్రుతచరిత్రుడైనాడు. ఆ

ప్రతిష్ఠా శుభముహూర్త సమయ మెట్టిదో కాని నాటినుండి అప్పనపల్లి యాతాయాత త్రైర్థిక శ్రేణి మనోరథములను నెఱవేర్చు శ్రితజన సురభియై చెలువొందు చున్నది.

నేను సకుటుంబముగా బహుపర్యాయములు అప్పనపల్లిని సందర్శించుట జరిగినది. వెళ్ళినప్పుడెల్ల నేదోయొక ప్రత్యగ్ర వాగతీత మధురానుభూతి ప్రస్ఫుటమగుచున్నది. నిర్మల వైనతేయ నిమ్నగా ప్రవాహము, త్రిజగన్మోహన సౌందర్య శాలియైన శ్రీబాల బాలాజీస్వామి, దైవదర్శనాగత సముల్లసితభక్తజనబృందము, నిస్తుల వాస్తు కళాశోభిత దివ్య దేవాలయ వైభవము, చక్షురుత్సవసంధాయక ప్రకృతి సౌందర్యము నాహృదంతరములో ప్రగాఢ ముద్రను పాదుకొల్పినవి. ఇట్టి పవిత్రక్షేత్రనాథుఁడైన శ్రీ బాలబాలాజీ స్వామిని శతకకృతిరూపమున సంస్తుతించి, సుశ్లోకుడను కావలయు ననెడి స్థిరసంకల్పము నాయెదలో రూపు దిద్దుకొన్నది. సర్వభార మును శ్రీ స్వామిపై మోపి నే నీ ప్రయత్నమునకు కృతనిశ్చయుడ నైతిని.

ఆంధ్ర సారస్వతమున శతకములు పరశ్శతముగా వెలసెనను విషయము విజ్ఞులకువిదితమే. భక్తి, శృంగార, నీతి, వైరాగ్య ప్రదాయకములుగా నివి ఆయా కవివరేణ్యుల అమేయ ప్రతిభా పాటవములకు ప్రతీకలుగా నిలిచి, సాహితీ ప్రియంభావుకులకు కర్ణరసాయనము లగుచున్నవి.

శతకము నందలి పద్యములకు పూర్వాపరసమన్వయ మక్కరలేదు. ఏ పద్యమున కాపద్యము ప్రత్యేక వైశిష్ట్యముగలిగి వర్ణ్యవస్తువును పఠితల మనోముకురములందు ప్రతీయమాన మొనర్చు చుండును. ప్రాచీనాంధ్రకవుల శతకసారస్వతమును తులనాత్మక పరిశీలనము చేసినచో మనకీ విషయము విస్పష్టమగును.

"నా నేర్చిన భంగిఁ జెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటి కిన్" అని ప్రవచించిన తిక్కనామాత్యుని, అభిజ్ఞోక్తిని సిగపూవుగా స్వీకరించి, నేను "బాలబాలాజి! అప్పనపల్లిదేవ!" అను మకుటముతో ఈ చతుశ్శతిని సంతరించి ఆస్తికమహాశయులకు పూజా ప్రసూనముగా సమర్పించుకొనుచున్నాను. ఎడనెడ కొన్ని పద్యములు సంస్కృత సమాసభూయిష్ఠముగా నున్నను, అవి భగవన్నామ గుణరూప సంకీర్తనమునకు అనువై యుండునని తలచితిని. సహృదయ భాగవతశేఖరులు కర్తృత్వ విషయమునకంటె శతకస్థదైవ సంస్మరణ విషయమునకు ప్రాముఖ్యమునొసఁగి, యీకృతిని నిత్యపఠనపాఠన యోగ్యమొనర్చి, ఆ నీరేజాక్షుని నిర్వ్యాజకృపాకటాక్ష సుధారసనిస్సరణములో పరిపూతులు కాగలరని విశ్వసించుచున్నాను.

ఇట్లు,
విద్వజ్జన విధేయుడు
సీతారామయ్య

కృతజ్ఞతా సమర్పణాంజలి

విష్ణుపారమ్య ప్రతిపాదకమై భక్తిభావ బంధురమైన, ఈనా 'అప్పనపల్లి శ్రీబాలబాలాజీ చతుశ్శతి" ముద్రణార్థము అనతికాలములోనే అమేయమైన ఆర్థికసాహాయ్యమును అందించిన తిరుమల తిరుపతి దేవస్థానయాజమాన్యమువారికి మదీయకృతజ్ఞతా పురస్సరిత నమస్కృతులు.

నిరంతరగీతాజ్ఞానయజ్ఞ నిర్వహణ ధురీణులయ్యును. నా యభ్యర్థనను మన్నించి, యీ చతుశ్శతిని సమగ్రావలోకనము చేసి, సన్మతిని మెచ్చి "ప్రిహస్తోక్తిని" ప్రవచించిన, ఆధ్యాత్మిక చింతనా విహాయసవీథీ విశ్రుతవిహారులు, చతురవాక్సుధాసారసమ్మోదిత శ్రోతృజనసారంగసందోహులు, 'జ్ఞాన బ్రహ్మ' "ఆర్షవిద్యా వాచస్పతి' శ్రీశ్రీశ్రీ స్వామిసుందర చైతన్యానందులవారికి—

అత్యంత వాత్సల్యముతో అనుగ్రహ భాషణ మొసంగి, నన్నలరింపజేసిన, శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులు, ఉభయవేదాంతాచార్య పీఠాధిపతులు, వేదవిశ్వవిద్యాలయ స్థాపకులు, శ్రీమత్పరమ హంస పరివ్రాజకాచార్యులు. శ్రీ శ్రీశ్రీ త్రిదండి శ్రీ మన్నారాయణ చినజీయర్‌స్వామిజీ వారికి—

కోరినదే తడవుగా కాదనకుండా సాదరముగా ఈ చతుశ్శతిని సమాలోకనము చేసి, తమ 'ఆమోద ప్రకాశము"ను ప్రసరింపజేసిన, శిరీష సుమకోమల సుధామధురోక్తి విలసితులు, వ్యాఖ్యాతృవతంసులు 'ప్రవచన శిరోమణి" శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యుల వారికి—

చక్షురక్షర సంయోగముతో ఆద్యంతము అనుశీలించి మత్కృతికి మురిపెంపు "మేలిపలుకు" లొలికించిన మాన్యమిత్రులు, విద్వత్కవివరేణ్యులు, 'భారతాచార్య' డాక్టర్. జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారికి— మామక మనఃపూర్వక నమస్సుమనస్సులు.

నా రచనను సుహృద్భావముతో సమీక్షించిన స్నేహశీలుఁడు శతావధాని శ్రీ అబ్బిరెడ్డి పేరయ్యనాయుడుగారికి - నాకు వివిధ విషయములలో సహకరించిన ఆత్మీయులు శ్రీ యర్రంశెట్టి శ్రీనివాస రావుగారికి, శ్రీ పంపన రామారావుగారికి-నా హార్దాభినందనలు.

నాలో ప్రాదుర్భవించిన భగవద్భక్తిని ఛందోబద్ధ కవితారూప తరంగిణిగా, జాలువాఱఁ జేయుటలో గృతకృత్యులైన నా సహధర్మచారిణి శ్రీమతి రాజరత్నమునకు, ప్రియపుత్రుఁడు చిరంజీవి వేంకట సత్యదుర్గా ప్రసాదరావునకు ప్రియ పుత్రిక చి॥ సౌ॥ కొత్తపల్లి అనూరాధకు-మదాశీ రక్షతలు.

ముఖపత్రముపై ముద్రించుటకై మొలకనవ్వులుచిందించు శ్రీ బాలబాలాజీస్వామివారి ఛాయా చిత్రమును అందజేసిన శ్రీ అప్పన పల్లి బాలబాలాజీ దేవస్థాన యాజమాన్యమువారికి నా కృతజ్ఞతా సహకృతానేక సాధువాదములు.

అమిత శ్రద్ధాసక్తులతో ఈనా హస్తాక్షర కృతికి, రమణీయ ముద్రణాకృతిని కల్పించుటలో అహరహము పరిశ్రమించిన విజయశ్రీ ప్రెస్ అధినేత చిరంజీవి గణపతిరావునకు నా ఆశీర్వాదములు.

ఇట్లు
సాహిత్యాధ్వనీనుఁడు
- మెండా చిన సీతారామయ్య

ఇష్టదేవతాస్తుతి

శ్రీరాధావనజేక్షణా కుచయుగశ్రీగంధ సంవాసిత
స్ఫారోరస్స్థల కౌస్తుభుండు, మురళీ సంగీత సమ్మోహితా
భీరైణీనయనా విలాస నటనాపేక్షాంతరంగుండు, బృం
దారామాంతరకేళిలోలుఁడు యశోదాపత్య మోమున్ మమున్ 1

సామజదైత్యసూదనుఁడు, శైలవిభేదన ముఖ్యదేవతా
స్తోమకిరీటరత్నరుచిశోభిత దివ్యపదాంబుజుండు, దు
ర్గామహిళామనోహరుఁడు, రౌప్యగిరీంద్రవిహారుఁ డార్తలో
కామరభూరుహుండు శివుఁ డాద్యుఁడు మమ్ముల నేలు నిచ్చలున్. 2

సురమునిసంఘముల్ గొలువ శుభ్ర కుశేశయ పీఠిపై నిరం
తరము వసించి పల్కుఁజెలి నవ్వులపువ్వులఁ జొక్కునట్టి యా
సరసిజ నాభసూతి ననిశంబును మాకుఁ జిరాయురున్నతుల్
కరుణ నొసంగవేఁడెదను గ్రమకవిత్వవచస్సుమాంజలిన్. 3

దురితధ్వాంతముఁ బాపఁ దిగ్మరుచిగా దుఃఖాద్రిసందోహమున్
హరియింపన్ గులిశమ్ముగాఁ బ్రబల విఘ్నానోకహానీకమున్
బెఱుకన్ జండమరుత్తుగాఁ బరఁగు స్తంబేరాస్యు హేరంబునిన్
స్థిరభక్తిన్ భజియింతు నేను ధిషణాదీవ్యత్కవిత్వాప్తికై. 4

నిర్ఝరస్రోతస్వినీ వీచికా డోలి
కా మాలికా చలత్కోమల నవ
కల్హార సాంద్రసుగంధ సంగ్రహణ స
మాగత సమద బంభర నితాంత
ఝుంకార విభ్రాంత ఝషకేతనాధూత
శింజినీ వల్లీవిచిత్రరావ
విహ్వాల యౌవత విభ్రమ విహరణ
ప్రాసాద చంద్ర శాలాప్రతిష్ఠి
తక్షపేశదృషత్స్థల స్థగితమౌక్తి
కాతతచ్ఛవు లొలయు సాకేతమందు

మాలయు జానకీజాని మామక దురంత
పాపభుజగసుపర్ణుఁడై వఱలుఁగాక. 5

నీరధి లంఘనావగత నిర్భరరంహుని రామపాద నీ
రేరుహ మాకరంద లహరీ పరితోషిత చిత్తభృంగునిన్
హీరసముజ్జ్వలాంగుని వనేచరనాథునిఁ బింగళాక్షునిన్
మేరుసమానధీరుని సమీరకుమారునిఁ గొల్తు భక్తిమై 6

క్షీరపయోధిపుత్రియయి శిష్టవరప్రద కామధేనువై
వారిజనేత్రు పేరురముపై నెడఁబాయక పొల్చియుండు ల
క్ష్మీరమణీలలామ నిజశీతలపేశల సద్ఘృణాసుధా
సారములన్ మముం దనిపి శాశ్వతభోగము లిచ్చి కావుతన్. 7

ఓ జగదేకమాత! వికచోత్పల పత్రవిశాల నేత్ర! ని
ర్వ్యాజ కృపాసముద్ర! నిగమాంత హిరణ్మయ కుండలప్రభా
రాజిత సత్సభాంతరః చిరంతన మౌనిజనాస్యదర్పణ
భ్రాజిత దివ్యరూపః నినుఁ బాయనిభక్తి భజింతు భారతీ! 8

విమల కృష్ణానదీ వీచికా గత సమీ
రంబులు వింజామరములు వీవ
మల్లీశ్వరస్వామిమస్తకాలంకృత
బాలేందురోచి నివ్వాళు లిడఁగ
ఇంద్రకీలాహార్య సాంద్రవృక్షచ్ఛాయ
భవ్యాతపత్రమై పరిఢవిల్ల
వందారు సద్భక్తబృందాంతరంగముల్
పూజా సుమంబులై పొలుపు మిగుల
విజయవాటికా సౌవర్ణ పీఠిమీఁద
నయినపర్వంబుగా దర్శనం బొసంగు
కనకదుర్గా! విదారిత కలుషవర్గ!
ఏటి కోళ్ళందు కొనుచు మమ్మేలు తల్లి 9

స్తోత్రలహరి

శ్రీ కైవల్యపదప్రద!
నాకధునీజననపాద! నందక ధారీ!
సాకార! నిరాకార! భ
వాకూపార కలశీజ! ఆగమరూపా! 1

తిరుపతి వేంకటరమణా!
దరహాసముఖారవింద! ధరణీ దయితా!
నిరుపమ కారుణ్యగుణో
త్తర! త్రిగుణాత్మక! దశావతారవిరాజీ!

లీలామానుష విగ్రహ!
ప్రాలేయమయూఖమౌళి వందితనామా!
త్రైలోక్యాభయదాయక!
క్షాళితశరణార్థిదురిత కర్దమనిచయా! 3

నీరద శక్రనీలరమణీయ తనూవిభవమ్ముతోడ, వి
స్ఫార విలోచనాబ్జవిలసత్కరుణా మధువృష్టితోడఁ జాం
ద్రీరుచిరాభసుందర వినిర్మల హాసముతోడ, భక్తమం
దార! ముకుంద! నీ మధుర దర్శన భాగ్య మొసంగ వేఁడెదన్ 4

నీవె మదీయమానసవనీ రుచిమన్మథుమూర్తివంచు, సం
భావన చేసి, మోహకరమంగళరూప! త్వదీయపాదసే
వా వినిబద్ధబుద్ధి ననవద్యసుఖప్రదముక్తిభద్ర దం
తావళ కుంభపీఠి సముదాత్తగతిన్ జరియింప నెంచెదన్. 5

మోహనవంశనాళరవమున్ విననంతనె సృష్టియెల్ల, ను
త్సాహసమగ్రతన్ బరవశంబగు నందు, రదౌక్కమాఖు, శే
షాహిశయాన! నా చెవుల హాయిగ నింపుము, స్వర్గసౌఖ్య సం
దోహముఁ గోరబోను బరితోషముతోఁ బులకింతు నీ యెడిన్. 6

నీ రమ్యాలోక జ్యో
త్స్నారోచులు నిండినట్టి నామది పారా
వారమ్మై యుప్పొంగదె?
పారాశర్యాది సుకవి వర్ణిత చరితా! 7

పదునాఱేఁడుల ప్రాయమందుఁ గవితా ప్రావీణ్యముం జూపి, శా
రదఁ గై సేసితి 'తేనెవాఁక'లను పేరన్ ఖండకావ్యోపదన్
ముదమొప్పారఁగ "సుప్రభాత" సుమనఃపుంజంబు నీకిచ్చితిన్
మది నిగ్గాంచు నదృష్టమీయఁగదె శ్రీమద్వేంకటాద్రిప్రభూ! 8

ఒప్పులో తప్పులో యెఱుఁగ నొజ్జల పజ్జను నేర్చినట్టి మేల్
కప్పురతావి పోఁడుములు గల్గు తెలుంగుఁగవిత్వపుంజవుల్
చొప్పడ నిన్ననారతము స్తోత్రము సేసెద, కావ రాఁగదే
అప్పనపల్లి దేవర! కృపామృతసాగర! వేంకటేశ్వరా! 9

భక్తితోఁ జతుశ్శతిని నీపై రచించి
ప్రీతి నీకుఁ గానుకగ సమర్పించుకొంటి
భక్తరోలంబనికురుంబ పారిజాత!
వేంకటేశ్వర! నన్ను దీవింపుమయ్య! 10

అనుక్రమణిక

		పుట
1.	శ్రీ స్వామి సంకీర్తనము	1
2.	అప్పనపల్లి క్షేత్రవైభవము	10
3.	ఆత్మ నివేదనము	17
4.	వివిధ దైవత భాగవత వర్ణనము	61
5.	శ్రీరామావతారలీలలు	64
6.	శ్రీకృష్ణావతారలీలలు	68
7.	సామాజిక స్పృహ	75
8.	దశావతార వర్ణనము	81
9.	కృతికర్తృవిషయాదికము	83
10.	ఫలశ్రుతి	85

1 శ్రీ స్వామి సంకీర్తనము

శ్రీసతీలోచనోత్పల భాసమాన
పూర్ణిమాహిమధామ! అంభోజనాభ!
శ్రితజనావనదీక్షాధురీణహృదయ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 1

ఆదిమధ్యాంతరహిత! ప్రహ్లాద నార
దాది సద్భక్తజనసేవితాంఘ్రియుగళ!
విహగపరివృఢవాహన! వేదవేద్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 2

మాన్యమునిగణ జేగీయ మాన చరిత!
సకల లోకపాల! మనోజ్ఞ శక్రనీల
శతసహస్ర రోచిర్నిభ శ్యామలాంగ!
బాల బాలాజి! అప్పనపల్లి దేవ! 3

దైత్యసందోహకాంతారదావదహన!
దురితసంతమసచ్ఛటాద్యుమణితేజ!
పీతకౌశేయ పరిధాన! విశ్వరూప!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 4

మఘవముఖ్యనిర్జరనమ్రమమౌళిరత్న
కాంతినీరాజితచరణకంజయుగ్మ!
పన్నగాధీశపర్యంక! పరమపురుష!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 5

ప్రణవకాసారసంచారరాజహంస!
వివిధబాధాశిలోచ్చయభిదురపాణి!
భాగవతచాతకవినీలవార్షుకాభ్ర!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 6

శంఖ చక్ర గదా శార్ఙ్గ సహితహస్త !
సురధునీజన్మకారణసుభగపాద!
జానుపర్యంతలంబితస్వర్ణహార!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 7

సత్పురుషశుకానీకరసాలసాల!
చికురపిహితవిశాలసుస్నిగ్ధఫాల!
అప్రమేయవిశిష్టగుణాలవాల!
బాలబాలాజి ! అప్పనపల్లి దేవ! 8

శ్రీనివాస! పద్మావతీప్రేమపారి
జాతసౌరభ్యసంసక్తచంచరీక !
సచ్చిదానందసద్గుణసౌమ్యమూర్తి!
బాలబాలాజి ! అప్పనపల్లి దేవ! 9

యదుకులాంబుధిచంద్ర ! మాయాప్రకల్పి
తాఖిలజగత్సమూహ ! వేదాంతకనక
పంజరస్ఫురచ్ఛారిక! పాండురంగ!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 10

సుజనహిత! జగన్నాటక సూత్రధారి!
సర్వలోకైకదేశికసార్వభౌమ!
పూర్వగీర్వాణదుర్వారగర్వహరణ!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 11

నవ్యనవనీతచోర! బృందావనీ వి
హార! శతకోటిమన్మథాకార! రుక్మి
ణీ రుచిరదరహాసచాంద్రీచకోర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 12

దేవకీప్రియాత్మజ! వసుదేవనయన
తామరసనభోమణి! యశోదా ముదబ్ధి
పర్వ చంద్రమ! నందగోపాలబాల!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 13

అమృతరూప! హృషీకేశ! యజ్ఞపురుష!
విష్టరశ్రవ! వైకుంఠ! వృష్ణితిలక!
అచ్యుత! వృషాకపి! ఉపేంద్ర! అద్వితీయ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 14

బర్హి బర్హావతంస! దాశార్హ! రమ్య
కౌస్తుభవిరాజమాన వక్షఃప్రదేశ!
సప్తభూభృన్నివాస! ప్రసన్నహాస!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 15

ఏకశృంగ! విష్వక్సేన! వృష! విరించి!
విష్ణుదేవ! సాత్వత! శిపివిష్ట! కపిల!
పృశ్నిగర్భ! అధోక్షజ! విశ్రుతాత్మ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 16

వామదేవప్రియంకర! సోమసూర్య
లోచనద్వయ! నిర్జర నైచికీ ప
యోభిషేకస్ఫురన్నిత్యయౌవనాఢ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 17

రాధికా వరవర్ణినీ ప్రణయచూత
పల్లవాస్వాదనోన్మత్త పరభృతంబ!
రాసలీలావినోదసంపత్ప్రవణహృదయ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 18

ముంజకేశ! త్రివిక్రమ! ముక్తసంగ!
చక్రపాణి! చతుర్భుజ! జలజనాభ!
కైటభారి! నారాయణ! కనకవసన!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 19

నిర్మల జ్ఞానదీపకాంతిచ్ఛటా వి
దారితభవాంధకార! పంకేరుహాస
నాదిదైవదురాపదివ్యస్వరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 20

ఫల్గునశతాంగచోదక! ప్రత్యగాత్మ!
చైద్య మస్తకచ్ఛేదక! సత్యదేవ!
మహితముచికుందమోక్షద! మంజుభాష!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 21

చతురశృంగారసాగర! శాంతరూప!
సురుచిర మసార సన్నిభ శోభనాంగ!
అభయ ముద్రాంచిత వర కరాంబుజాత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 22

సనకముఖ్యయోగీశ్వరవినుతచరిత!
మారుతాత్మజపూజితచారుచరణ!
కార్తవీర్యబాహు సహస్ర గర్వ హారి!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 23

సింధుకన్యామనోహర! శేషభోగ
మణివిరాజితమేచక మంజులాంగ!
నవ్యమౌక్తికాలంకృతనాసికాగ్ర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 24

గర్భదారిద్ర్యవిధ్వంసక ప్రసిద్ధ
నామ! సంస్తుత్యసద్గుణోద్దామ! సవితృ
వంశ కలశాబ్ధి సోమ! విపద్విరామ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 25

అసితకువలయసమధికమసృణదేహ!
మిత్రవిందా మనఃప్రియ! ఛత్రితాహి!
హంసడిభక దుర్ణయ తుహినాంశుమాలి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 26

దేవకీగర్భశుక్తి మౌక్తికఫలంబ!
సత్యభామా మనోవనీ నిత్యచైత్ర!
త్రిజగదాహ్లాదకారకదివ్యరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 27

నిర్వికార! నిరంజన! నిర్వికల్ప!
నిరుపమాన! నిరామయ! నిర్విశేష!
నిష్కళంక! నిరాకార! నిర్నిరోధ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 28

క్షీరసాగరశయన! లక్ష్మీ కుచాగ్ర
మృగమదామోదపులకితమేచకాంగ!
భవ్యనిశ్శ్రేయసప్రదపాదపద్మ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 29

నందనందన! గోవింద! నాదలోల!
కేశవ! వనమాలి! హరి! శ్రీకృష్ణ! శౌరి!
కంబుకంధర! కమలాక్ష! కంసవైరి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 30

మాధవా! మధుసూదన! మదనజనక!
వరకృపావరుణాలయ! వాసుదేవ!
వడ్డికాసులసామి! శ్రీవత్సచిహ్న!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 31

నిత్యసంతోషదాయక! శ్రుత్యతీత
భవ్యకాంతివిద్యోతితదివ్యదేహ!
నిజముఖోద్గీతగీతాధునీప్రవాహ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 32

అంబురుహపత్రనేత్ర! సంయమివరేణ్య
మానసారామచైత్ర! రమాకళత్ర!
దురితవల్లీలవిత్ర! సాధుజనమిత్ర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 33

ఉపనిషద్వనకేళీమయూర! కాళి
యాహిభోగాగ్రవిస్ఫురితాంఘ్రియుగళ!
పద్మజాతాండభాండసంభరితగర్భ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 34

సర్వతోముఖ! భక్తవత్సల! పురాణ
పురుష! కుత్కీలధారి! మధ్వరి! సహస్ర
శీర్ష! దామోదర! ముకుంద! సింధుసదన!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 35

రామ! రఘురామ! జగదభిరామ! దనుజ
రాజదుర్వారగర్వవిరామ! భవ మ
హాబ్ధి తారకనామ! భద్రాద్రిధామ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 36

శ్రుతిశిఖావతంసపవిత్రసుందరాంఘ్రి
పల్లవద్వయ! ప్రణవరూపప్రభావి
తాఖిలాండకోటి ద్రుహిణాండనిచయ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 37

కనకమయచేల! ముకురసంకాశరమ్య
భాసురకపోల! గాయకభక్తగాన
లోల! కాయకాంతిజితేంద్రనీలజాల!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 38

శ్యామసుందర! భువనరక్షైకదక్ష!
చిద్గగనవిస్ఫురద్రమ్యశీతరోచి!
నామగుణరూపరహిత! సన్మాన్యచరిత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 39

నిగమనిగదితనిరుపమసుగుణపుంజ!
అష్టకులసతీరుచిరవక్త్రాబ్జమిహిర!
విష్టపత్రయరక్షావిశిష్టహస్త!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 40

నిఖిలదిగధీశ బృంద వందిత పదాబ్జ !
శుకమునీంద్రవచోవార్ధిశుభ్రకిరణ!
వాఙ్మనోనేత్రదుర్లభభాగ్యరాశి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 41

జలజభవ శార్ఙ్గి శర్వతేజఃప్రభాస!
ముగ్ధమోహనసౌందర్యముదితభువన!
సాధుసారంగయూథవర్షాపయోద!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 42

జయ భుజంగాహితధ్వజ! జయ రమేశ!
జయ సునాసీరసేవిత! జయ మురారి!
జయ కపర్దికార్ముకభంగ! జయ శుభాంగ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 43

శ్రౌతమాకందశాఖాచరత్పికేంద్ర!
ఘోషయోషిజ్జనాపరకుసుమబాణ!
శుక్లపక్షచంద్రాలోకశుభ్రహాస!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 44

2 అప్పనపల్లి క్షేత్ర వైభవము

రమ్యమై కుంతపురిపై విరక్తిఁ జెంది
కోనసీమ నప్పనపల్లి కోవెలకును
పద్మతోడ వచ్చిన నీకు స్వాగతంబు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 45

ఉత్తరదిశాభిముఖముగాఁ జిత్త మలరఁ
బాఱు వైనతేయాపగాతీరభూమి
ఖ్యాతిఁ గాంచిన శ్రితలోకకల్పశాఖి!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 46

నయనపర్వముఁ గూర్చెడి నారికేళ
వృక్షసంతతి నడుమ సంప్రీతిఁ గొలుపు
దేవళంబున నెలకొన్న దివ్యమూర్తి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 47

మిసిమి తొలుకారుమబ్బుల మేలమాడు
నీలదేహముతోడ మా మ్రోల నిలిచి
కనుల విందొనగూర్పుము కాంక్ష తీఱ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 48

ధర్మసంస్థాపనార్థమై ధరణిఁ బుట్టి
దుష్టనివహంబుఁ గూల్చి సాధులను గాచి
భక్తరక్షకబిరుదానఁ బరఁగు వరద!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 49

సూరిజనులకుఁ గొంగుబంగార మగుచు
దీనజనులకు దేవతాధేను వగుచు
ముదముతో దర్శనం బిచ్చు సదమలాంగ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 50

సౌరభంబులు చిమ్ము పటీరజలము
నాలయపు వాకిటను గలయంపిఁ జల్లి
మేలి ముగ్గులు వెట్టిరి మెలఁత లెలమి,
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 51

కర్ణపేయమై గుడిని జేగంట మ్రోఁగఁ
గనుల నానందబాష్పశీకరము లొల్క
జనులు నిన్నుఁ జూచు వేడుక సాగినారు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 52

ప్రాతరాదిత్యకిరణవారమ్ము సోఁకి
పులకరించిన క్రొందమ్మిపూలు దెచ్చి
దాసు లర్చింప నిన్ను విచ్చేసినారు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 53

వేదకోవిదగ్రామణుల్ విప్రవరులు
వారిదగభీరకంఠరావముల నిన్ను
మస్తకన్యస్తహస్తులై ప్రస్తుతింత్రు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 54

అభము శుభము నెఱుఁగని యప్పన్న నాఁడు
తపము చేసిన యట్టి యీ స్థలము నేఁడు
రహిని నీ యునికిచేఁ దీర్థరాజమయ్యె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 55

"దేవదూత" రామస్వామి దీక్షఁ బూని
ఏడుకొండలవాని సర్వేశు నిన్ను
'బాల బాలాజి" గా నిటఁ బాదుకొలిపె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 56

అగ్ని దగ్ధమై పూరిల్లు హరువు మీఱి
దివ్య దేవాలయంబుగాఁ దేజరిలఁగ
హేతుభూతుఁడ వీ వని యెంతు మేము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 57

కోవెలకు ధ్వజస్తంభంబు కొఱకు, వఱద
లోన టేకుమ్రాను తనంతఁ దానె యేఁగు
దెంచుటన్న నీ మహిమ గాఁ దెల్ల మయ్యె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 58

నాఁడు చెఱసాలలోఁ బుట్టినావు; నేఁడు
వేడ్కఁ గొబ్బెరరాశిలో వెలసినావు;
నీదు లీలలు మాకు వర్ణింపఁ దరమె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 59

నిత్య యాత్రాస్థలంబుగా, నిఖిలభక్త
కామితార్థప్రదాయిగాఁ గడుఁబ్రసిద్ధిఁ
గాంచె నప్పనపల్లి నీ కారణముగ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 60

మల్లికా కుంద మందార మాలతీ ల
తాంత మాలికల్ నీ కంఠ మం దలంక
రింపఁ జేరినారు జనులు శ్రేణులుగను
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 61

జాతికులమతభావంపు శంక లేక
యెల్లవారలు సహపంక్తి నుల్ల మలర
భోజనము సేయుటు గుడి నబ్బురము గాదె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 62

శేషపర్యంకశాయి లక్ష్మీధవుండు
పార్థసారథి పుట్టలోఁ బాలు ద్రావు
శ్రీనివాసుఁడు కోవెలఁ గానిపించుఁ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 63

మయునిఁ దలదన్ను శిల్పులు నయము మీఱ
దివ్యనిస్తులవాస్తు దీధితులు నింపి
తిరుమలకు దీటుగా గుడిఁ దీర్చినారు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 64

విమలగోదావరీతరంగముల మీఁది
కొదమతెమ్మెరల్ వేఁబోక ముదముతోడ
వీచి వీచోపులై నీకుఁ బ్రీతినెఱపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 65

అప్సరోవధూవ్రాతంబు నపహసించు
నాటువెలఁదులు చతురలాస్యము లొనర్పఁ
గలిమిదేవేరి కీర్తిఁగంటు నలరు స్వామి
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 66

ఫణసహస్రంబు ఛత్రమై పరిఢవిల్ల
భుజగనాథుఁ డనంతుఁడు నిజతనూ వి
లాస మెసఁగ ని న్గొలువ విచ్చేసినాఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 67

పక్షవిక్షేప సంజాత పవనవేగ
ఘూర్ణితాంభోధి ఖగరాజు కుతుక మొప్ప
నీ విహారవాహన మౌచు నిలిచినాఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 68

స్వర్ణశైలాభదేహుండు, స్వామికార్య
తత్పరుఁడు హనుమంతుఁడు ద్వారపాల
వృత్తిఁ జేపట్టి నీగుడి నిచ్చగించె;
బాల బాలాజి! అప్పనపల్లిదేవ! 69

కలుషహారిణి యాకాశగంగ నీదు
చారుచరణకంజాతసంజాత యగుచు
విష్ణుపది యన్న తనపేరు విశదపఱిచె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 70

కామగవిపాలతోడ సుత్రాముఁ డెలమి
నమృతమాధుర్యతుల్యపాయసముఁ దెచ్చి
ముచ్చటగ నీకు నైవేద్య మిచ్చి మురియు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 71

సరస సంగీత రసధునీ ఝరులు పొంగ
నారదుఁడు తుంబురుఁడు నీదు చారుచరితఁ
బాడుచుందురు దృఢభక్తిభరితు లగుచు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 72

సుర గరుడ నాగ యక్ష కింపురుష సిద్ధ
సాధ్య కిన్నర ముఖ్య ఖేచర గణంబు
నమ్రశీర్షులై నీకు వందన మొనర్తురు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 73

బ్రహ్మరుద్రు లింద్రాదిదిక్పతులు పరమ
భాగవతులు, మహర్షులు భక్తి నిన్ను
సౌఖశాయనికు లగుచు సంస్తుతింత్రు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 74

కలికిచూపులకలువదండల నొసంగి
యలంతినవ్వుల నివ్వాళు లెలమి నిచ్చి
సిరియుఁ బుడమియు నినుఁ గోరి చేరినారు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 75

నందనోద్యానసీమలో నందమైన
యలరులను గోసితెచ్చి మాల్యములు గ్రుచ్చి
వేల్పుటిల్లాంగ్రడు నీ కీయ వేచినారు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 76

వైనతేయనిమ్నగ విరజానదీమ
తల్లిగాఁ, జిన్నియప్పనపల్లి భాస
మాన వైకుంఠపురిగ మా మదిని దోఁచు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 77

పచ్చవిలుకానితల్లికిఁ బంటవలంతి
కొక్కరూపునఁ బొలయల్కఁ జక్కదిద్దు
చతురరసికునిగా నిన్ను స్తుతులొనర్తు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 78

తమ్మిచూలికి శూలికి నెమ్మనమున
సమ్మదముఁ గూర్చు భవదీయచారుమూర్తి
వీక్షణోత్సవ మొప్పఁ జూపింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 79

3 ఆత్మనివేదనము

చూపులు చకోరకంబులై చుట్టుముట్టి
యుష్మదీయాస్యచంద్రదపీయూషపాన
పారవశ్యాన నిరతంబుఁ బర్వులెత్తు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 80

హృదయభావసుమంబుల నేర్చికూర్చి
యుపదగా నీకు నర్పింప నుత్సహింతు;
దీను నను గావు మో సామగానలోల!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 81

ఇంద్రతుల్యవైభవముపై నిచ్ఛలేదు
త్రిదివసుందరీరమమాణదృష్టిలేదు
భక్తి నిన్ను సేవింప నాసక్తిగలదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 82

ఆపదలు శ్వాపదములై భయానకముగ
మీఁద లంఘించు దుర్వేళ నాదుకొనఁగ
నభయహస్త మందించు రథాంగపాణి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 83

ముంచుకొనివచ్చు దుఃఖసముద్రభంగ
సంఘములఁజిక్కి తరియింప శక్తిలేక
నిన్నె పెనునౌకగా మది నిలుపుకొంటి;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 84

జననమరణమ్ము లీ కాలచక్రమందుఁ
జాలగాఁ బొంది విసిగి వేసారినాఁడ
వేగ నినుఁజేరు త్రోవఁ జూపింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 85

చీఁకటిని జూచి భీతిల్లు చిన్నిబిడ్డ
నెదకుఁజేర్చెడి తండ్రిగానెంచి నిన్నుఁ
బ్రీతిఁ గొల్చెడి నాకుఁ జేయూఁతనిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 86

బ్రతుకుఁ దార్థియపురుషార్థపరముఁజేసి
జీవితచరమాంకమున నిన్ జేరినాఁడ
వ్యసనపరతంత్రు మన్నింపుమయ్య నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 87

జ్ఞానలవదుర్విదగ్ధత సాధుజనులఁ
బ్రల్లదములాడి పాపకూపమునఁబడితి
పతితపావన! నన్నుఁ గాపాడుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 88

ఊహలుప్పొంగు రత్నాకరోర్మిమాల
లౌచు డెందంబు నైశ్చల్యమందకుండ
క్షోభఁబెట్టును; శాంతిఁ జేకూర్పు నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 89

కనులఁగూరుకురాదు నెమ్మనము సతము
ప్రాణభీతిని నూయెలపగిది నూఁగు
నెటులఁ గరుణించి ప్రోతువో యింక నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 90

ఎట్టి క్లేశములైన నిన్నెంచఁగానె
వెలుతురును జూచి చీఁకటి తొలఁగురీతిఁ
బంచబంగాళమై వేగఁ బరుగుదీయు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 91

ఆలుబిడ్డలు చుట్టము లాత్మసఖులు
భోగభాగ్యతతులు నీటిబుడగలంచుఁ
దెలిసికొని నిన్ను నమ్మితి దృఢముగాను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 92

నిబిడదారిద్ర్యకల్లోలినీప్రవాహ
మందు మున్గి తేలెడి నిస్సహాయునన్నుఁ
గనికరంబున దరిఁజేర్చి కావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 93

దారసంతానపోషణభారవశత
నలసిపోయితి సంసారజలధినీఁదఁ
జేతులెత్తి మ్రొక్కెదఁ గటాక్షింపునన్ను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 94

ఎదురుదెబ్బలుతప్ప నాబ్రదుకులోన
వీసమెత్తుసౌఖ్య మనుభవింప నైతి
నుడుకుఁగన్నీరుఁ దుడువరావోయి వరద!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 95

త్రాఁచు ఫూత్కారములకు సంత్రాసమందు
కప్పరీతి మృత్యువు పేరు చెప్ప గానె
యడలిపోయెడి నా కభయమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 96

నియమబద్ధత నిన్ను ధ్యానింపలేను
స్పష్టముగ నీదు కీర్తనల్ పాడలేను
కృప దలిర్పఁగా నన్ను వీక్షింపు మభవ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 97

వేదశాస్త్రవైదుష్య మబ్బినదిలేదు
విదిత తీర్థ దర్శనము చుక్కెదురు నాకు
హృదిని నమ్మితి నీవె నా కేడుగడగ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 98

ఆశలను కందిరీఁగ లీ యంతరంగ
కోటరముఁజొచ్చి నిరతమారాటపెట్ట
శ్రమముఁబొందెడినాకు స్వాస్థ్యమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 99

నామరూపరహితు నిన్ను నేమ మొప్పఁ
దలఁచి తరియింప నా కసాధ్యంబుగాదె?
ఆర్తునకు నాకు నీవె కొండంత యండ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 100

తీవ్రరోగార్తిచేఁ గడు దిగులుఁజెంది
కన్నులనె ప్రాణముల్ నిల్పుకొన్నయట్టి
ప్రజకు సర్వథా నీవె శ్రీరామరక్ష
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 101

నీటి యెద్దడిఁజూచి కన్నీరుగార్చి
పైరుఁగావంగ నిను రైతు కోరినపుడు
వృష్టిఁ గురియించి సస్యసమృద్ధి నీవె
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 102

దుఃఖమేఘాంచలంబునఁ దొంగిచూచు
మోదసౌదామినీరేఖ మోహపఱుప
బ్రతుకు బాధలు మఱతురు ప్రజ లదేమొ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవః 103

తారకబ్రహ్మమంత్రతత్త్వజ్ఞుఁ డంజ
నా సుతుఁడుతప్ప భవదీయనామమహిమ
నెఱుఁగ నెవ్వారు దక్షు లీ పృథివిలోన
బాలబాలాజి! అప్పనపల్లిదేవః 104

శుద్ధచైతన్యమూర్తిగా సూరిజనులు
నిన్నుఁ బేర్కొందు రదియేమొ నిశ్చయించి
తెలిసికొనెడి శక్తినిఁ బ్రసాదింపు నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 105

అగణితంబులగు మతము లవతరించి
నిన్ను వాకొన్నతీరు సంతృప్తి నిడదు;
సగుణుఁడవొ నిర్గుణుఁడవొ విస్పష్టపఱుపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 106

ఆజవంజవపాథోధియందు మున్గి
కొట్టుమిట్టాడు నన్నుఁ జీకొట్టకుండఁ
దావకకటాక్ష నౌకతోఁ గావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 107

చల్లఁజేయఁ జొక్కపువెన్న సంభవించు
రీతి నిష్ఠతో నినుఁగొల్వఁ జేతమందుఁ
గానవత్తువు సత్స్వరూపాన నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 108

వాఙ్మనోనేత్రములకుఁ దావకనిసర్గ
తత్త్వ మెఱుగంగ శక్యమే? తామసుఁడను
నాకు నీ దర్శనంబుఁ గన్పార నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 109

నీదుపాదాబ్జసంసేవ నీదుభక్త
కోటితోడి సాంగత్యంబు సాటిలేని
భూతదయను నా కొసఁగు సంప్రీతితోడ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 110

అరణిలో నగ్ని గూఢమై పరగురీతి
నీవు మాలో నిగూఢమై నిండియుండఁ
గాననట్టి యజ్ఞుల మమ్ముఁగావుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 111

నీ విరాడ్రూప మెంచివర్ణింప ముక్త
సంగులైనట్టి పరమహంసలకునైన
శక్యమే? వృజినారణ్యజాతవేద!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 112

పూర్వభవమునఁ జేసినపుణ్యమేమొ
తావకపదాబ్జశుశ్రూష దక్కెనాకు
జన్మరాహిత్య మొసఁగి నన్ సాఁకుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 113

నీకు సాటిదైవంబు ముల్లోకములను
వెదకి చూడఁగ లేఁడని విజ్ఞు లనఁగ
నమ్మి నీపజ్జ నేఁ జేరినాఁడ తండ్రి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 114

వలపుటూబిని దిగజారి కలఁతఁజెందు
చిత్తమత్తేభమును గృపాసింధు వగుచు
నాదుకొనుమయ్య కోటితిగ్మాంశుతేజ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 115

నీవు ప్రత్యక్షమై కోరుకో వర మన
నేమికోరఁగవలయునో యెఱుఁగనేను;
అన్నిటికి నీవె దిక్కని యాత్మఁదలఁతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 116

పునుఁగు జవ్వాది కస్తూరి పూసినీకు
సేవఁజేయంగ మదినిఁ గాంక్షింతుఁగాని
పేదవాఁడ నేనేమి యర్పింపఁగలను?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 117

షడ్రసోపేతమైన భోజనమునీకుఁ
గూర్చఁగాలేనుగాని, నా కూర్మివంటు
కంబుఁ దినిపింతు భక్తిదుగ్ధంబుతోడ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 118

నేయివోసిన భగ్గను నిప్పువోలెఁ
గోరికలు హెచ్చి యెదను గగ్గోలుపఱుపఁ
గ్రిందుమీఁదగు నన్ను రక్షింపుమయ్య.
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 119

శక్తి క్షీణించె ధైర్యంబు సన్నగిల్లె;
స్వాతిశయము దొలఁగెఁ బ్రాణభీతి హెచ్చె;
నీవె గతి నాకు వేఱొండు దైవ మెఱుఁగ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 120

రామునామ మందారమరందధార
లనిశమానందమునఁ గ్రోలునట్లు మామ
కాత్మ పుష్పంధయమును సమాదరింపు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 121

మిహిరకోటిప్రకాశ! నీమహిమ లెన్న
నలువకును వేయుపడగలచిలువకైన
వశముగాదన్న నేనెంతవాఁడనయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 122

ఫుల్లహల్లకసౌగంధ్య ముల్ల మలరఁ
జేయునట్లు నీపైని నేఁ జెప్పుకైత
నాకు నిర్భరానందసంధాయి గాదె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 123

నిర్వికల్పసమాధిలో నిన్ను నేను
నిత్యచైతన్యమూర్తిగా నిరతితోడఁ
గాంచునతిలోకభవ్యభాగ్యమ్ము నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 124

అస్తినాస్తిసంశయముతో నలమటించి
తావక నిగూఢ పరతత్త్వ తంత్రమేమొ
కానలేని శాలీను నన్ గావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 125

అభ్రగంగానదీ ప్రవాహమ్ము వోలెఁ
జాలువాఱు శ్రుతిహిత ప్రశస్తకవిత
లల్లఁగలవారె కవులు నీయండలేక?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 126

"రామ" "కృష్ణ" యనెడు భవన్నామగోస్త
నీరసాస్వాది యైనట్టి నా రసనకుఁ
బలురుచులపై నపేక్షయే పగిదిఁగలుగు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 12[illegible]

తనువు పులకించిపోవు నీ దర్శనమున
వీక్షణంబుల హర్షంబు వెల్లివిరియు
మనసు శాంతినిశాంతమై తనరుచుండు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 128

మూఁగ వక్తయై ప్రజకు సముద్రముఁ గూర్చు
కుంటి కుప్పించి లంఘించుఁ గొండలైన
నీ దయాపాంగలోచననియతిఁజేసి;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 129

అమ్మయొడిలోన సుఖనిద్ర నందినట్లు
నేను నీ పదాంబుజసన్నిధానమందు
నవ్యయానందమాధుర్య మనుభవింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 130

హృదయసింహాసనంబున ముదముతోడ
నిన్నుఁగూర్చుండఁ బెట్టి నా విన్నపములు
చెప్పఁగానెంతు వేగవిచ్చేయు మయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 131

అండపిండవేధోండనాయకుని నిన్నుఁ
త్రికరణస్ఫూర్తిగాఁ బ్రస్తుతించువారి
కైహికాముష్మికఫలంబు లబ్బ కురుదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 132

సూర్యకిరణముల్ జగమెల్ల సోఁకునట్లు
తావకకృపాసుధావృష్టి దాసజనుల
పైని వర్షించి వారికిఁ బ్రమద మిడదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 133

నాకు నీపాదసేవయే నాకలోక
సౌఖ్యమునకంటె నధిక హర్షమునుగూర్చుఁ
గాన నాకట్టి మహితనిధాన మిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 134

క్షీరనీరవిభాగంబుఁ జేసి హంస
క్షీరమును గొన్న రీతి మాచేష్టలందు
మంచినే యెంచి చెడు రూపుమాపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 135

కాలిధూళి సోఁకిన ఱాయి కాంత యగుట
వింతలకు నెల్ల వింత యీ విశ్వమందు
వాకొన వశంబె? నీ ప్రభావంబు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 136

ఎన్ని రూపులు దాల్చి నీ వున్నఁగాని
నామదికి నీవు సచ్చిదానందమూర్తి
వై యజస్రము దోఁచి సౌఖ్యమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 137

నీదు శ్రీపాదరేణువు నాదుశిరము
సోఁకెనేని మత్కిల్బిషస్తోమమెల్లఁ
దొలఁగి నిస్తుల సుకృతముల్ పొలుచునయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 138

నెలవుకొన్న వి ముదిమిచిన్నియలు మేన
నీదు సేవ చేయంగ నింద్రియములింక
వశముగాకున్న నను: దప్పుపట్టకోయి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 139

కుక్షిఁ బదునాల్గు లోకముల్ గొమరు మిగుల
నిల్పి కాపాడు దేవర నీవ కావె?
సాటియెవరయ్య నీకు నిస్తంద్రతేజ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 140

తలఁచినంతనె భక్త సంతతికి నెల్ల
వెతలుదీఱిచి సౌఖ్యసంహతుల నొసఁగి
యాదుకొనువేల్పవని నిన్ను నభినుతింతు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 141

కలుషభావంపు వఱదల మలినమైన
చిత్తనిమ్నగ భవదీయ చింతనంపు
స్ఫటికసంస్పర్శచే శుభ్రపడునుగాదె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 142

సడలె దేహవల్లరి; శిరోజములు నఱసె
మాట తడబడెఁ గోర్కెలు మాత్ర మొక్క
రీతి నీరికలెత్తి యూరింపసాగె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 143

మనసు తాదాత్మ్యమందు నీ మందిరమున
నిలిచి నీరమ్య రూపంబు నేత్ర పర్వ
ముగ విలోకించు సుజనసమూహమునకు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 144

ఉపనిషత్సార మంతయు నొడిసిపట్టి
పండితుండైన నేమి లాభంబుగలదు
తావక పవిత్ర నామచింతనములేక ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 145

ఫలమొ పుష్పమొ తోయమొ కలిగినంత
నీకు నైవేద్యమొసఁగి ధ్యానించువారి
సంకటముఁ బాపు భక్తవత్సలుఁడ వీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 146

జగము సృజియింపఁ బోషింప సమయఁజేయ
బ్రహ్మ విష్ణు రుద్ర స్వరూపములతోడఁ
గొలువఁబడెడి త్రిమూర్త్యాత్మకుండ వీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 147

ఉత్తమోత్తమ నరజన్మ మెత్తికూడ
పాడుపొట్టకై వ్యాకులపడునుగాని
జనుఁడు భవదీయతత్త్వజిజ్ఞాసఁగనఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 148

కామమున గోపికల్, భీతిఁ గంసుఁ, డమిత
భక్తి భీష్ముండు, మైత్రి విష్ణుచ్చుఁ దుగ్ర
వైరవృత్తిఁ జైద్యుండు నిన్ జేరికొనరె ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 149

కారుమబ్బుల మెఱపులు గానవచ్చు
రీతి విపదంధకారసంఘాతమందు
నీకృపాజ్యోత్స్న మాకుఁ గన్పించుఁగూర్చు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 150

బాల్య కౌమార యౌవన వార్ధకములు
నాల్గుదశలు గల్గియును మానవుఁడు నిన్నుఁ
జిత్తశుద్ధిఁ గొలువ సమాయత్తపడఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 151

గగనసుమమయ్యె నేఁడు నిష్కామభక్తి
ప్రతిఫలాపేక్ష లేక యెవ్వాఁడుఁగూడ
స్థిరమతిని నిన్నుఁదలఁప యత్నింపఁడయ్యె
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 152

ధాత్రిలో నిన్ను మించు ప్రత్యక్షదైవ
మెవరు స్వామి? నేఁగడగండ్ల బవరమందుఁ
జిక్కు కొంటిని నన్గటాక్షింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 153

కోరికల బెబ్బులుల్ చిత్తగుహను దూరి
సంతతము బొబ్బలిడఁగ స్వాస్థ్యంబుఁదక్కి
విహ్వలుఁడనైన నన్గావ వేగ రమ్ము
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 154

మెఱుపుమెఱసినసమాడ్కి నామెదడులోన
హృద్యపద్యముల్ నిరవద్యరీతిఁ గదలి
పర్వులెత్తుట నీ కృపావశతఁగాదె!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 155

భవదుపాంతరమ్యభవనోపరితలంబుఁ
జేర నిర్వ్యాజభక్తినిశ్రేణి నెక్కి
యుద్యమించెడు నాకుఁ జేయూత నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 156

తలఁపులన్నియు నీయందె నిలిపి, త్రికర
ణంబు లెప్పట్టునఁ జపలత్వంబు నొంద
కుండ నినుఁగొల్చు కలిమి నా కొసఁగుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 157

నా మనోరథములుదీర్చు స్వామి యంచు
నిన్నడుగఁగూడ దనుకొందు, నిజము సెప్ప
నంతరంగము నేఁ జెప్పినట్లు వినదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 158

కానికలుదెచ్చి యిచ్చెడివాని కీవు
వరము లిచ్చుటయెబ్బంగి పాడియయ్య
శ్రీపతివి నీకు లోటేమి సిరినిగూర్చ?
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 159

దండధరుభ్రమోల భయదవేదండపాద
ఘట్టన నలంగి మేను కళావికలయి
పోవ నిచ్చగింపను; నాకు ముక్తినొసఁగు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 160

ప్రతిపదము భవద్వర్ణనాస్వదముగాఁగ
నాదురసనపై నిరతంబు నలువచెలువ
నిలిచి పల్కునట్లుగఁ గరుణింపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 161

నన్ను భవపాశమునఁ గట్టు నిన్ను నేను
భక్తిపాశముతోఁ గట్టి పంతమలర
హృదయదేవాలయంబున నెలమి నిడుదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 162

విడువనయ్య నీపాదారవిందసేవ;
నదియె మద్భవరోగదివ్యౌషధంబు
గాన నాకట్టి మహితభాగ్యమ్ము నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 163

రిక్తహస్తాలతోడ నర్చింప నిన్నుఁ
జేరితి ననుకోకు; మదీయ చిత్తసుమము
నీ కుపాయన మొనరింతు స్వీకరింపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 164

నీదుగుడిచుట్టు వలగొని నెమ్మనంబు
భవదమృతనామచింతనాపారవశ్య
మందుఁ దేలఁగాఁ దృప్తిఁ గన్గొందు నిన్ను
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 165

పెరటిలోన నీవుల ద్రమాను వెలసినట్లు
వెలిమొదవు చేరువకువచ్చి నిలిచినట్లు
నీవు ప్రత్యక్షమై నన్నుఁ బ్రోవుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 166

పూచు నిన్నెంచ నామేనఁ బులకవల్లి;
ఆపదలు గడతేర్చు కన్నయ్య వీవు
కొండదిగివచ్చి నాయెద నుండుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 167

దవ్వు నెంచక నీ సన్నిధానమునకుఁ
జేరితిమి మేము; కారుణ్యసింధువగుచు
నయనపర్వమ్ముగా దర్శనమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 168

భక్తులెందఱొ నిన్నుఁగొల్చి ముక్తిఁబొంద
నా విషయ మీవు పట్టించుకో వదేమి?
పక్షపాతము చూప భావ్యంబె నీకు ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 169

సృష్టి పుట్టినదాదిగా నెన్ని జన్మ
లెత్తినాఁడనో నాకేమి యెఱుక లేదు;
నేఁటి కైనను నన్నుఁ గరుణింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 170

అస్మదానందకలశరత్నాకరమును
నింగి ముట్టెడునట్టు లుప్పొంగఁజేయు
పర్వశుభ్రాంశుఁగా నిన్ను భక్తిఁదలఁతు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 171

రోమహర్షణ మొదవు నీనామ మెన్న
జన్మసాఫల్య మగును నీచరిత విన్న
కలుము లోనఁగూడు నీదు వక్త్రింబుఁగన్న
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 172

భవదపార సేవాసరోవరమునందు
జలకమాడఁదలంచు నన్నన్నహో మ
రాళ మపవర్గరమ్యహర్మ్యమును బొంద
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 173

బుద్ధిమాంద్యము వెన్నంటి ముసలితనము
రోగభరితమై బ్రదుకును గ్రుంగదీయ
నరుని కప్పుడు నీవు గన్పడుదు వేమొ
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 174

సత్య మారయ రోగముల్ జనులపట్ల
వరము లేయౌను; లేనిచో వారునిన్ను
మదిని దలపోయువారె దుర్మదము హెచ్చి?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 175

పెద్దగండంబునుండి తప్పించి నన్నుఁ
బ్రాణభయము లేకుండఁ గాపాడినట్టి
నీకు హృదయపూర్వకనమోవాకశతము
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 176

పూర్వకృతకర్మఫలములు సర్వమాన
వాళి యనుభవింపక తప్పదన్న నిజము
నా కెఱుకయయ్యె నేఁటి గండంబువలన
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 177

రెండునెలలు పైఁబడినవి గండమునకు
నేను బాల్పడి, గాయంబు మానదేమి?
శీఘ్రమే దానిని నివృత్తిఁ జేయుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 178

నీవుతప్ప వేఱెవరు ధ్యానింప నాకు?
రుగ్ణుఁడైనట్టినాకు నారోగ్య మొసఁగి
చల్లగాఁజూడరమ్ము వాత్సల్యమెసఁగ
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 179

స్వేచ్ఛ యెక్కడిదయ్య నాజీవితమున
సతతతాపత్రయోగ్రపాశమునఁ జిక్కి
కలఁతవడునాకు బంధమోక్షమ్మునిమ్మ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 180

ఎందఱనొ ప్రోచితీవని యందు;రవని
నీదుభక్తులు; దానిని నేను నమ్మఁ
బోను; స్వీయానుభూతిని బొందువఱకు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 181

చెవులుసోఁకిన నీదువంశీరవమ్ము
సృష్టిసర్వస్వముఁను బులకించిపోవు
నందు రార్యులు, నాకట్టివిందు నొసఁగు
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 182

కష్టములువచ్చినప్పుడుగాని నిన్నుఁ
దలఁవనట్టియజ్ఞుని నన్నుఁదప్పుపట్టు
కుండ సైరణఁజేసి కైదండ నొసఁగు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 183

చందనద్రుమంబున విషసర్పరాజి
చుట్టుముట్టినరీతి నన్నట్టివెతలఁ
బెట్టు పాపౌఘములను బోఁగొట్టుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లి దేవ ! 184

శ్రమము నొందితివేమొ శశ్వద్విలాస!
సృష్టిరక్షాభరంబు వహించి నీవు
సేదఁ దీరు మొకింత నా చిత్తశయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 185

ఉత్తమశ్లోకు నిన్ను నా యుల్లమందు
నిలిపి భజియింపఁ గిల్బిషానేకపాళి
బెదరిచను సింహగర్జన విన్నపగిది;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 186

వాసనారూప సముదగ్ర వాయుహతికి
సమసిపోకుండ భక్తిదీపమును నీవు
కరపుటాచ్ఛాదనముతోడఁ గావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 187

వలదు సురసద్మసౌఖ్యముల్ వలదు భోగ
భాగ్యచయము, కావలయు నీపావనాంఘ్రి
పద్మసంసేవనావైభవంబు నాకు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 188

నీదుగుడిగంట మ్రోఁగిన మోదమెసఁగఁ
గోటి వల్లకీ తంత్రులు మీటినట్లు
పులకలెసరేఁగి నామేనఁ బొడమునయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 189

గమ్యమెఱుఁగక జీవితకాలమంత
వ్యర్థపుచ్చి పరితపించి భవదుపాంత
మునకుఁ జేరితిఁ గృప నను బ్రోవరావె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 190

భక్తి నినుగొల్చు వారికి ముక్తిమంది
ర ప్రవేశంబు కడు సుకరంబుగాదె?
సత్కృపాలోకసంతృప్త సాధులోక!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 191

నీవు నాకట్టెదుట నిల్చి నిరుపమాన
భవ్యభవదీయ రమణీయవదన చంద్ర
బింబరోచిస్సుధల ముంపింపునన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 192

కలవు నవవిధభక్తి మార్గములు నీదు
సన్నిధికిఁ జేరఁ దలపోయు సజ్జనులకు
వానిలోనాకు సముచిత పథము నిమ్మ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 193

సత్త్వగుణవిభాసితుఁడవు; తాత్త్వికాగ్ర
గణ్యుఁడవు; చరాచర జగత్కారణుఁడవు
మామకానందవనధివి; స్వామి! నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 194

భారతీరమ్యతరపాదనీరజాత
కింకిణీ నిస్వనంబును గ్రేణిసేయు
మృదులకవితాఝురీనాద మిమ్ము నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 195

తావక దశావతారగాథా స్రవంతి
నోలలాడ మాభవబంధజాలమెల్లఁ
ద్రెళ్లి నిర్వాణపదవి సిద్ధించుఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 196

ఓపి కొక్కింతయును లేదు రేపు నాది
యౌనొకాదొ యనెడు శంక యావహిల్లఁ
జెచ్చెర నిను భజింతు; రక్షింపు నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 197

అఖిలయోగప్రదుఁడవై యజాండమెల్ల
నిండియుండిన తేజోమయుండ వీవు
నన్ను నిత్యసంతుష్టు నొనర్పుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 198

పాపకృత్యముల్ చేసినవాఁడ, దైవ
దూషణకుఁ బాల్పడిన వాఁడ, దోషకలితు
నాశ్రయార్థిని మన్నింపుమయ్య నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 199

ఇహమునందు నకాలమృత్యుహరణంబుఁ,
బరమునందు వైకుంఠనివాసయోగ
సిద్ధి యగుఁగాదె నిన్నుఁబూజించు ప్రజకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 200

జీవుఁడను నేను, పరమాత్మ వీవు; కింక
రుండనేను; జగద్వల్లభుండ వీవు
పతితుఁడను నేను పరమపావనుఁడ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 201

భావదారిద్ర్య మెచటుఁ దోఁపంగనీక
భక్తిరససుధాఝరి పరవళ్ళుద్రొక్క
నతుల మత్కవిత్వముఁ దీర్పుమయ్య నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 202

ఏలొకో తెలియని యసంతృప్తి నాదు
హృదయకుహరమునందుఁ జేరినది తండ్రి!
శీఘ్రమే దాని దూరంబు చేయుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 203

మ్రొక్కుబడులు చెల్లించి నీమ్రోల నిలిచి
కోర్కెలను దీర్పుమని నిన్నుఁ గోరఁబోను
సుంత దయఁజూప నిన్నుఁ బ్రార్థింతు నెదను;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 204

ప్రత్యహము నీదు చరణనీరజరజంబు
నొదల ధరింప నీకు సాష్టాంగపడుదు
ప్రేమమీఱ నాకట్టియదృష్ట మిమ్ము;
బాలబాలాజి ! అప్పనపల్లి దేవ! 205

వానఁదడియనివాఁడు నిర్వ్యాజమైన
భవదపారకృపావృష్టిఁ బరవశింప
నట్టి భక్తుఁడు గలఁడె యీ యవనిమీఁద?
బాలబాలాజి, అప్పనపల్లిదేవ! 206

బ్రతుకువైకుంఠపాళిలో వెతలచిలువ
పైకిరాకుండ సతము నన్ బట్టిమ్రింగు
నభ్రగపతివై నీవు నన్నాదుకొనవె!
బాలబాలాజి, అప్పనపల్లిదేవ! 207

శుచినో నే నశుచినో మనస్సునకు సుంత
కూడఁదోఁచదు నిను భక్తిఁగొల్చువేళ
దోషమెంచక నాకుఁజేదోడుకమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 208

సర్వనదులు సాగరములో సంగమించు
నట్లుగా నీకుఁ బ్రతిరూపులై వెలుంగు
నఖిలదేవతార్చనలు నీ కందుఁగాదె!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 209

భక్తిమాకందతరువుపైఁ బరవశించి
ప్రణవగానమొనర్చు దైవస్వరూప
పికవరేణ్య! సద్గతిని జూపింపు మాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 210

పాదమున గంగ, బొడ్డున బ్రహ్మ, యురము
నందు లక్ష్మి, కన్నులుగ సూర్యహిమకరులు,
పాన్పుగఁబెనుఁబాము,గల విశ్వపతి వీవు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 211

పుట్టినది మొదల్కొని చనిపోవువఱకుఁ
గష్టములుదప్ప వెంతటిఘనునికైన;
నరుఁడవై నీవు పడవె బన్నములు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 212

పామరుఁడు నిన్ను ఱాయిఅప్పగభజించు;
జ్ఞాని నామరూపరహితుఁగా నెడంద
నెంచు; నెటులైన నీవె మాకేడుగడవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 213

వెన్నదొంగవై దీనులవిన్నపములు
విన్నదేవరవై కనుసన్నలోక
పాలన మొనర్చు నిన్ను సద్భక్తిఁదలఁతు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 214

ఎంతవర్ణించినను నిన్నుఁదృప్తిలేదు
వాగతీతుఁడవౌ పరబ్రహ్మవీవు;
బాలిశుఁడ నేను పేర్కొనవశమె నిన్ను?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 215

మనసు నిల్వ దేలొకో క్షణమాత్రమైన
నిర్మలంబుగ నిన్ను ధ్యానింపవలయు
నన్ను; నలసు నన్ మన్నింపుమయ్య కృపను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 216

కష్టములమబ్బుదొంతరల్ గ్రమ్ముకొనిన
నీ కటాక్షప్రభంజనాస్తోకధాటి
కెదురునిల్చునె చిద్రుపలై చెదురఁగాని?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 217

స్వామి! భవదాలయద్వార సవిధమందు
నిల్చి నీ దివ్యమంగళనీలదేహ
కాంతిరింఛోళి నను సోఁకసంతసింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 218

ఇందుఁగల వందులేవను సందియమ్ము
ప్రజలయెదఁగల్గకుండ సర్వత్రనీవు
దర్శనంబిచ్చి రక్షింపఁదరలిరమ్ము
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 219

నిన్ను నమ్మి చెడినవాఁడు నిఖిలజగము
లందు లేఁడని యెంచి యవ్యాజభక్తి
నిన్నె సేవింతు నన్గరుణింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 220

నియమనిష్ఠాగరిష్ఠులు నిత్యసత్య
రతులు వైఖానసాదిసద్వ్రతులు నిన్ను
నుంత గానలేరన్న నేనెంతవాఁడ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 221

భవ్యభవదీయ కృష్ణరూపంబు నేను
స్వప్నజాగ్రత్సుషుప్తుల క్షణముగూడ
విడువకుండ వీక్షించు సద్విభవమిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 222

రాఘవేంద్రయతిని, పోతరాజకవిని,
త్యాగరాజ వాగ్గేయకోత్తముని నీవు
ప్రోచిన తెఱంగుమాకు సమ్ముదము గూర్చు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 223

ఆత్మనిగ్రహశక్తి, సత్యానురక్తి,
విమలతరభక్తి, మధురోక్తి వేడ్క నాకొ
సంగి కృపఁజూడుమయ్య వాత్సల్యమెసఁగ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 224

అడుసుఁ ద్రొక్కి పిదపఁ గాళ్లుగడుగుకొన్న
రీతి దుష్కార్యములొనర్చి భీతి నిన్నుఁ
జేరి మ్రొక్కెదు మమ్ము రక్షింపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 225

మామకహృదయనందనారామసీమ
భవదపారకృపాఝురుల్ పాఱెనేని
భక్తిమందారసూనముల్ పరిమళించు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 226

ఎంతమొఱపెట్టుకొన్న నావంతఁ దీర్ప
రా వదేల? వెనుక గజరాజు నీవు
ప్రోచినట్టి గాథను నమ్మఁ బోను నేను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 227

స్వర్ణహారము లొసఁగి; దేవళము గట్టి
గారవించినభక్తుఁడు ఖైదు జేరె
భక్తి నినుఁగొల్వ ఫలిత మిప్పగిదియౌనె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 228

నీదుపదభక్తినిరతుఁడ నిన్నుఁ దప్ప
నన్యదైవములను వేఁడనట్టివాఁడ
నిస్సహాయుని నన్గణింపరావె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 229

పాపకర్దమదుర్గంధభరితమైన
మత్తనువు భవదీయనామస్మరణను
రాపగావగాహమున ధన్యతను గనదె?
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 230

పలుకుఁబూఁబోఁడి నెదలోననిలుపుకొన్న
కవివరులెనిన్ను వర్ణింపఁగలరొ? లేరొ?
నామమాత్రపుఁగవిని నే నేమొనర్తు?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 231

నన్ను సదసద్వివేకసంపన్నుఁజేసి
భక్తివైరాగ్యభావప్రవర్ధనునిగ
నీపదాంభోజసన్నిధి నిలుపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 232

కేవలము దేవళమ్మునసీవు వెలసి
నాఁడవను నమ్మకము విడనాడి మేము
నలుగడల నిన్ను దర్శించు కలిమినిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 233

గోవుతో గురువులువాయు కోడెభంగి
నిన్నుఁ గనువేడ్క వచ్చు విపన్ను నన్ను
నీదు మృదులాంక శయ్యపై నిలుపు మభవ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 234

అవధరించినకొలఁది నీయమృతచరిత
మంతరంగ నైర్మల్యంబు నందఁజేసి
యుష్మదంఘ్రిసామీప్యంబు నొసఁగుఁ బ్రజకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 235

ఆశ లడియాసలై నిస్పృహాగ్ని శిఖలు
సోఁకి శోషిల్లునన్ను నిస్తుల భవత్కృ
పాకటాక్షసుధావృష్టి సోఁకుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 236

ఐదుపదిచేసి నీయాలయాంతరమునఁ
దనువు ధనువురీతి నవనతంబొనర్చి
పాహి మాం పాహి యనునాకుఁ బ్రాపునీవె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 237

హరివొ క్రీస్తువొ అల్లావొ యరయ నిన్ను
నేమిపేరునఁబిలిచిన స్వామి! మాకు
నేత్రపర్వమొనర్పఁ గన్పింపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 238

అఖిలవేదపురాణశాస్త్రాధ్యయన మ
హితఫలము గల్గుఁగాదె దృఢతరభక్తి
ని న్నొకపరి స్మరించు విపన్నతతికి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 239

జపతపోధ్యాన నిరతులు సన్మునీంద్ర
వర్యు లర్చించు భవదంఘ్రిపద్మయుగళి
యక్షయసుఖప్రదాయియై యలరుఁగాక;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 240

పట్టుతేనెకంటె రసాల ఫలముకంటె
గోస్తనీగుళుచ్ఛముకంటె గొప్పదైన
నీపవిత్రనామరుచి వర్ణింపఁదరమె ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 241

పాలసంద్రపు టలల నుయ్యాలలూఁగి
పాపఱేని మవ్వపుసెజ్జఁ బవ్వళించి
కలిమిచెలిదోరవలపులఁగులుకు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 242

చక్కనయ్యవునీవు నిన్నొక్కమాఱు
తనివితీరఁజూచిన దురితంబులెల్లఁ
దొలఁగి సమధికశ్రేయముల్ గలుగుఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 243

అవ్యయంబగు నీ కరుణామృతంబు
భక్తిభృంగారముల నేను బట్టి భృశము
త్రావనెంతును దివ్యనిర్వాణమంద;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 244

సుప్రభాత సేవాపరాస్తోకమతులు
పుడమివేల్పులు ప్రామిన్కనుడుల నిన్నుఁ
ప్రస్తుతింప మాకు శ్రవణపర్వ మొదవు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 245

అమృతరుచిమించు సత్కవిత్వము నొసంగి
మధుర మంజుల కావ్యనిర్మాణ దక్షుఁ
జేసి చిరయశస్కుఁగఁ గటాక్షింపు నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 246

ఎంతదైవోపహతులైన నుంత నిన్నుఁ
దలఁచినంతనె వారి ఖేదంబు దొలఁగి
మోద మరచేతియుసిరి కై వొల్చుఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 247

ముగ్ధమోహనమైన నీముద్దుమోము
నిర్నిమేషదృష్టుల నిదానించిచూచు
దివ్యవైభవమును ప్రసాదింపు మాకు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 248

తావకాపాంగ వీక్షణోత్పలములందుఁ
గ్రమ కరుణామరందంబు గదలియాడ
భక్తబంభరబృందంబు పరవశించు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 249

మహితలావణ్యరాశి పద్మావతీ ల
తాంగి యలమేలుమంగతాయారు తలఁపి
వలపువెన్నెలదోఁగునిన్ దలఁతుఁనెపుడు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 250

నీ దరస్మితచంద్రికల్ నిగుడుచోట్ల
దుర్భరామయధ్వాంతసందోహ మెడలి
విమల శాంతి సౌభాగ్యముల్ విస్తరిల్లు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 251

సగుణ నిర్గుణ పరతత్త్వమగుట నిన్ను
వివిధరీతుల దర్శించి విబుధవరులు
సంసృతి మహార్ణవ తరణ చణులుగారె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 252

పవన చలిత కదంబ పల్లవమువోలె
మృత్యుభీతిఁ గంపించు నాయెదను నీవు
పవ్వళించినఁ గొండంతబలము నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 253

హృదయవామలూరువునుండి యెగసిపడెడు
కోపకాకోదరంబును రూపుమాపు
తావకాహ్వాయదండమున్ దలఁతు సతము
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 254

ప్రాణదీపంబు కొడిగట్టువఱకు నీకు
సేవఁ జేయుదు; నాశేషజీవితమును
జక్కదిద్దవె యెట్టి కష్టములు లేక;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 255

ముదిమి పైకొని రోగముల్ ముసిరి, కఫము
కంఠమునఁ జేరి తీవ్రగాఢ్గద్య మొదవ
భావిగతి నెంచి యిపుడె నిన్ బ్రస్తుతింతు
బాలబాలాజి అప్పనపల్లి దేవ! 256

ఏ పగిది నిన్నుఁ బూజించి నీపదాబ్జ
సన్నిధికిఁ జేరుకొందునో స్వామి నాకుఁ
దెలియఁ జెప్పుము మదిలోనఁ గలతదీఱ
బాలబాలాజి అప్పనపల్లి దేవ! 257

బాడబానలక్షుభితార్ణవంబురీతి
వ్యథలఁ గ్రాగెడి యెడఁద నవ్యాజశాంతి
వృష్టిఁ గురియించి నాకు సంతృప్తి నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 258

విధివిలాసము నెవరు తప్పింపఁగలరు
జరుగ బోయెడి దేదియో జరిగితీరు;
మీఁదుమిక్కిలి నిన్ను నమ్మితిని దండ్రి
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 259

సానఁబట్టినకొలఁది వజ్రంబు తళుకు
లీను గతి భవచ్చింతనాధీనహృదయు
డష్టకష్టముల్ పాసి సౌఖ్యంబుఁ గనఁడె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 260

వెన్న జిడ్డుకెమ్మోవినిఁ జెన్ను మీఱ
మురళిమ్రోయించి సృష్టిని మోహపఱుచు
వ్రజకులాంగనాస్మర! నాకుఁ బ్రాపునీవె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 261

శ్రవణసుభగములైన నీ చారుచరిత
లెన్నిమాఱులు వర్ణించియున్నఁగాని
తృప్తిఁగనలేరు సుకవు లదేలసామి?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 262

నల్లనయ్యగఁబుట్టి వ్రేపల్లెలోన
గొల్ల యిల్లాండ్ర యీలువుల్ గొల్లగొట్టి
భక్తజన భాగధేయమై పరగు వరద!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 263

ఎంత మధురాతి మధురమో యెంచలేను
నీదునామపీయూషంబు; నెమ్మిదాని
బత్తిదోసిళ్ళఁ ద్రావి నేఁ బరవశింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 264

సర్వవేళల నిన్ను సంస్మరణఁజేసి
చర్మచక్షుర్యుగమ్మునఁ బేర్మిఁజూచు
గలిమినిమ్ము నేను మఱేమికాంక్షసేయ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 265

ధాత్రి నెంగిలి కాని పదార్థమేది
కలదు? నీపూజకొఱకు, నిర్మలమదీయ
హృదయసుమమునె నీకు సంప్రీతి నిడుదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 266

ఆశువుగ మనోహరకవితాంబురాశి
పొంగి పొరలిన సుకవి సమ్మోదమంది
యచ్యుతుని నిన్నుఁబొగడి విఖ్యాతిఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 267

ఆణిముత్యాలఁబోలు పద్యాలువ్రాసి
భక్తి నీకు హారముగ నర్పణమొనర్తు
నెలమి నాదు కాన్కను గ్రహియింపుస్వామి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 268

సర్వభారము నీ భుజస్కంధమందు
మోపి, నేక్రియాశీలినై యోపినంత
యత్న మొనరింతు నాకు జయమ్మునిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 269

మానసికరుగ్ణతకు మందు కానరాదు
ధరణి నీ దివ్యనామచింతనమె యెట్టి
వ్యాధినైన నిర్మూలించునట్టి మందు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 270

"తత్త్వమసి"యన్న పదమె యుత్సాహపఱిచి
స్వపరభేదరాహిత్య; నిస్సంగు నిన్నుఁ
గాంచు మార్గము నాకుఁజూపించె నెదను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 271

పిలిచినంతనె మఱుమాట వలుకు దొడ్డ
వేల్పుదొరవీవు; నాపైనిఁ బ్రేమఁజిలికి
యనుఁగుబిడ్డగ గుండెకు హత్తుకొనవె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 272

అవసరార్థము వచ్చు బంధువులె తప్ప
మమత లొలికించునట్టి చుట్టములు లేరు
భువిని నాకు నిజమగు నాప్తుఁడవు నీవె;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 273

అబ్జభవముఖ్యబర్హిర్ముఖార్చితములు
సౌరశైవలినీ జన్మకారకములు
మోక్షదములైన నీపదమ్ములు భజింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 274

తల్లివియుఁ దండ్రివియు గురూత్తముఁడవును
స్నేహితుఁడవును నన్ను రక్షించునట్టి
వేల్పువును నీవెగా మది విశ్వసింతుః
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 275

త్వన్ముఖోద్గీత మంజుగీతా సుధార
సంబుఁ గ్రోలెడి సుమతి శశ్వదపవర్గ
దివ్యవైభవమంది సంతృప్తిఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 276

యతులు ప్రాసల కొఱకుఁ బ్రయాసపడక
సురధునీఝరీ సన్నిభ స్ఫూర్తితోడ
మత్కవిత్వంబు నీపయి మరలనిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 277

హృదయపద్మవాసివని ని న్నెఱుఁగలేక
కొండకోనల నిన్నఁగోరువార
లెంత వెఱ్ఱులో నే వచియింపలేను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 278

తావక పదాబ్జరజము మత్తనువు సోఁకె
నేని జన్మజన్మాంతర కృతదురంత
పాపముల్ వాసి, నే భాగవతుఁడ నగుదు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 279

గగనవీథీ విహార రాకా సుధామ
యూఖబింబంబువోలె నాయుల్లమందు
సంచరింపుము నీవు హర్షంబుగూర్ప;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 280

చుట్టుఁగైదువుజోదవై సోఁకుమూఁక
నెల్లఁ బేరుటాలమునందుఁ ద్రెళ్ళఁజేసి
పుడమిజేజేల జోతలు పొందు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 281

లోకములు లోకపాలురు లోకవాసు
లందఱుఁ దెగినఁ దుది లోక మంతరింపఁ
బృథుతమమున నేకాకృతి వెలుఁగు వరద!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 282

మార నలకూబర జయంత మధు సుధాంశు
రూపగర్వాతిశయమును ద్రోసిపుచ్చు
మేటి యందగాఁడవు నీకు సాటియెవరు?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 283

వారిచర కూర్మ కోలంబ నారసింహ
ఖర్వ భార్గవ రాఘవ కంసదమన
బుద్ధ కల్క్యాది రూపప్రసిద్ధచరిత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 284

నిన్ను రథసారథిగఁ జేసికొన్న పార్థుఁ
డెంత మహిమాత్ముఁడో మది నెంచలేను
శ్లాఘ్యముకద నీభక్తవాత్సల్యగరిమ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 285

ఏమి పుణ్యము చేసెనో స్వామి నీదు
మోవి నటియింపఁ బిల్లనగ్రోవి తొల్లి
దాని భోగంబుఁ బేర్కొనఁ దరముగాదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 286

నన్ను నీ కౌఁగిలికిఁ దీసికొన్న యెడల
నేమి చెప్పుదు నాభాగ్య మింద్రపదవి
యైన నాకుఁ దృణప్రాయమౌను సుమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 287

పులినసీమలఁ బిల్లలు బొమ్మరిండ్లు
కట్టి పడఁగొట్టుభంగి లోకములు నీవు
సృష్టిజేసి లయమొనర్తువేలస్వామి?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 288

ఇష్టకామ్యార్థ సిద్ధ్యర్థ మెవరునిన్ను
సతత మర్చింతురో వారి వెతలుదీర్చి
వితతవైభవ మొసఁగు శ్రీపతివి నీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 289

మోక్షదము లైన నీ పదాంభోజయుగళి
నమ్మి చేరినాఁడ నిక దండధరు కాల
పాశమున కైన నే వెఱవంగఁబోను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 290

చిన్నిబిడ్డఁడు తప్పులు చేసెనేని
తండ్రి మన్నించుభంగి సంతతము నేను
జేయు దోషవ్రజము నుపేక్షింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 291

బధిరునకు శంఖమధురనిస్వనము చెవిని
సోఁకనట్లుగాఁ బరమనీచునకు భవ్య
భవదమృతచరిత్రలు శ్రుతిపర్వమగునె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 292

కన్నుమూసినఁ దెఱచిన నిన్నుఁదప్ప
నితరదైవములను జూడనిచ్ఛగింప;
నాలసింపక నాకుఁ బ్రత్యక్షమగుము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 293

సామజవరద! నాపైనిఁ బ్రేమఁజూపి
సాంఖ్యయోగరహస్యము స్పష్టపఱిచి
విజయునకు దీటుగాఁగ దీవింపు నన్ను
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 294

పండువెన్నెలకంటె సౌపర్వ నిమ్న
గాజలముకంటె మిహికానగంబుకంటెఁ
జల్లనగు నీదు చూపులు చాలు మాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 295

స్వామి! నీ పదాబ్జాతసేవామరంద
పాన మత్త మానసమధుపంబు, వివిధ
దైవ వరివస్యరుచి కెట్లు తనియఁగలదు?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 296

నిలువుదోపిడి చేసెడు కలిమి దొరవు
కాన, నా దురంతదురితోత్కరమునెల్ల
దోచి, నన్ను సుకృతిగ నాదుకొన రావె!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 297

కోటియజ్ఞఫలము సమకూరుఁగాదె
వాసుదేవ! ని న్నర్చించువారి కిలను
బ్రహ్మభావన నొసఁగి కాపాడు నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 298

వరద! నీ కరుణాసుధాపాంగరోచి
సుంత ప్రసరించెనేని నావంతలెల్లఁ
బోయి బ్రతుకు క్షీరాబ్ధియై పొంగిపొరలు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 299

దాస్యభక్తికి నేను బ్రాధాన్యమిచ్చి
నిన్నె సేవింతు నాదగు నన్ని బరువు
బాధ్యతలను నీవె వహింపు స్వామి యింక!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 300

4. వివిధ దైవత భాగవతవర్ణనము

తిరుమలను వేంకటపతివై తేజరిల్లి
ముగ్ధమోహనరూపవిస్ఫూర్తితోడ
చక్షురుత్సవ మొసఁగు నిన్ సన్నుతింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 301

అన్నవరమందు సత్యనారాయణుండ
వై యశేషజనావళి యార్తినెల్లఁ
బాఱ ద్రోలెడు నిన్ను సద్భక్తిఁ దలఁతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 302

సింహశైలాగ్రమున నధిష్ఠించి శ్రీనృ
సింహదేవుఁడవై జగచ్ఛ్రియమునకు
వరదహస్త మందించు నిన్ బ్రస్తుతింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 303

భద్రగిరిపైని శ్రీరామభద్రనామ
ధారివై యొప్పి జనకామితములనెల్లఁ
ద్వరితగతిఁ దీర్చు నీకు వందనశతంబు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 304

సూతశౌనకాదిమునులు ప్రీతితోడ
నైమిశారణ్యమందు ననారతంబు
నీదు భవ్యకథాలాపనియతిఁ గనరె?
బాలబాలాజి అప్పనపల్లి దేవ! 305

మూఁడుజన్మల వైరంబుఁబూని నీదు
ద్వారసంరక్షకులు నిన్నుఁ జేరిరన్న
స్వామిభక్తి కది నికషోపలముగాదె?
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 306

పృథివి సమలోష్టహేములై ప్రథితిఁగన్న
అంబరీషాదిరాజర్షు లమిత తావ
కీన శుశ్రూషచే ధ్రువకీర్తిఁగనరె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 307

రంతిదేవుఁడు ప్రాణనిష్క్రమణవేళ
జల మొసంగి పులస్కుని సాఁకి నీదు
శీతలకటాక్షవీక్షావిభూతిఁ గనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 308

ఆత్మసుతుని నారాయణ యనుచు మరణ
శయ్యనుండి పిలిచిన నజామిళునకు
సద్గతిని బ్రసాదించినస్వామి వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 309

గీతగోవింద కావ్యనిర్మాతకవివ
రేణ్యుఁడు జయదేవుఁడు నిన్నుఁ బ్రీతిఁ గొలిచి
పారలౌకికసౌఖ్యసంపత్తిఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 310

హరిహరాద్వైతతత్త్వంబు వ్యాప్తిఁజేసి
తెనుఁగునుడులతో జయమును దీర్చినట్టి
తిక్కయజ్వ భవత్కృపాదీప్తిఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 311

పుణ్యచరితుండు బమ్మెరపోతరాజు
భాగవతకర్తగా ఖ్యాతిఁబడయుటకును
గారణము భవత్కారుణ్యగరిమగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 312

అమరవాగ్గేయకారుఁడు విమలకీర్తి
సాంద్రుఁ డన్నమాచార్యకవీంద్రుఁడు, నినుఁ
బదకవిత్వముతోడ లోఁబఱుచుగొనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 313

నాదచతురాస్యుఁడై జగన్నాథు నిన్నుఁ
దనివితీర శ్లాఘించిన త్యాగరాజు
సుకృతియై భవత్సాన్నిధ్యశోభఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 314

మువ్వగోపాలపదములు ముదముతోడఁ
బాడి క్షేత్రయ్య భవదీయభక్తి కలశ
వార్ధిలోఁ దేలి, ధన్యజీవనుఁడుగాఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 315

జలధి వటపత్రమందున విలయవేళఁ
జిన్ని పాపఁడవైపండి సున్నితముగఁ
గాలిబొటవ్రేలు చీఁకు నీలీలలెంతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 316

5. శ్రీ రామావతార లీలలు

పుత్రకామేష్టిఫలముగాఁ బుట్టి నీవు
దశరథోర్వీశపుత్రునందనుఁడ వౌచు
రఘుకులాంబుధిశశివిగాఁ బ్రథితిఁగనవె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 317

ముగ్గురమ్మల ప్రేముడిపొంది, రామ
చంద్రనామంబుతోఁ బ్రజాస్వాంతములకుఁ
బ్రమదమొసఁగినట్టి పురుషోత్తముఁడ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 318

గాధిసూనుని జన్నంబుఁ గాచుకొఱకు
ననుఁగుఁదమ్ముఁడు వెంటరా నడవికేఁగి
తాటకనువధించిన నీప్రతాపమెంతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 319

గౌతమమహర్షి శాపంబు కారణముగ
ఱాయియైన యహల్యను రమ్యపాద
రజముచే నాతిఁ జేసిన ప్రభుఁడ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 320

చెఱకుగడను గంధేభంబు విఱుచుకరణి
శివధనువుఁ దున్మి జానకీధవుఁడ వైన
పురుషమోహనరూపు నిన్ బొగడవశమె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 321

పితృవచఃపాలనార్థము విపినములకుఁ
జిగురుఁగెమ్మోవి పై దరస్మితము చింద
వెడలినట్టి యాదర్శపుత్త్రుఁడవు నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 322

నదిని దాఁటించిన గుహుని మదినిమెచ్చి
భవజలధి దాఁట నతనికి భవదమేయ
సత్కృపాపోత మందించి సాఁకితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 323

భరతు నవ్యాజభక్తికిఁ బ్రమదమంది
పాదుకలనిచ్చి తన్మనోవాంఛఁ దీర్చి
రాజ్య మేలంగఁజేసినరాజవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 324

గడ్డిపోచ బ్రహ్మాస్త్రమై క్రమ్ముకొనఁగ
భీతిఁ గాకాసురుఁడు నిన్ను వేఁడినంత
నభయమొసఁగినట్టి శ్రితార్తిహరుఁడవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 325

శూర్పణఖ వచ్చి నీ తనూశోభఁగాంచి
మురిసి నినుగోర దానికి బుద్ధిఁగఱప
ముక్కుఁ జెవులు గోయించిన ప్రోడవీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 326

పంచవటిని ఖరాదిరాత్రించరాళి
నస్త్రనైపుణ్య మేపార యామ్యపురికిఁ
దరలఁ జేసిన జగదేకధన్వివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 327

ప్రాణములు పణంబుగ నొడ్డి పంక్తికంఠు
తోడఁ బోరి జానకినిఁ గాపాడ నుద్య
మించినట్టి పక్షికి మోక్షమిచ్చితీవు;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 328

శబరి యెంగిలిపండ్లు నిస్సంశయముగ
మెసవి యామెకుఁ గైవల్యమొసఁగుటన్న
నెంతగొప్పదేవుఁడవొ మా కెఱుకయయ్యెఁ;
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 329

వాలి నొక్కకోలను నేలఁగూలనేసి
రవితనూజుఁ గిష్కంధకు రాజుఁజేసి
చెలిమికిని మారుపేరుగా వెలసితీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 330

జవమున శతయోజనదీర్ఘ సాగరమును
దాఁటి సీతనుగాంచి తద్వార్తఁజెప్పి
నట్టి హనుమంతుఁ గడుమెచ్చినాఁడవీవు;
బాలబాలాజి అప్పనపల్లిదేవః 331

లంకకును దారిసీయని లవణకంధి
పొగ రణంప బ్రహ్మాస్త్రంబుఁ బూన నీవు
కాళ్ల వ్రేళ్లఁబడినవానిఁ గాచితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 332

ఉడుతసేవకు ముదమంది యొడిని జేర్చి
దాని కుత్తమగతిని నుదారరీతి
నొసఁగిన పరమకరుణామయుండవీవు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 333

శాత్రవసహోదరుఁడు విభీషణుఁడు నిన్ను
శరణువేఁడ లంకాపురీశ్వరునిఁజేయ
వాని కభయమిచ్చిన వీరవరుఁడవీవుః
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 334

వారధిని గట్టి వానరబలముతోడ
లంకకునుజేరి కుటిలుఁ బౌలస్త్యుఁగూల్చి
సీత చెఱను బాపిన రఘునేతవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 335

భరత లక్ష్మణ శత్రుఘ్న వాయుజ రవి
సుత విభీషణాది హితులు నుతులొనర్పఁ
బుడమి నేలిన రామభద్రుఁడవు నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 336

6. శ్రీ కృష్ణావతార లీలలు

దేవకీవసుదేవుల దిగులుమాన్ప
ముద్దు బిడ్డగఁ జెఱసాలఁ బుట్టి, గోకు
లమ్ము నోమిన నందబాలకుఁడవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ: 337

అబ్బురంబు గొల్పను యశోదమ్మ నిన్నుఁ
గన్న కొమరుకంటెను మిన్నగాఁ దలంచి
పెంచి పెద్దఁ జేసిన యితివృత్తమెన్న
బాలబాలాజి: అప్పనపల్లిదేవ! 338

పూతనావిషస్తన్యమభీతిఁ గ్రోలి
దానిప్రాణముల్ దీసి సద్గతినొసంగి
వాసికెక్కిన గోపడింభకుఁడవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 339

అమ్మ నే మన్నుఁ దినలేదు నమ్మ నాదు
పలుకు లని నోట బ్రహ్మాండభాండమెల్ల
హర్షమెసఁగఁ జూపిన పరమాత్మ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 340

బుల్లిబొజ్జఁ జతుర్దశభువన ములను
మోయు టెఱుఁగని తల్లి నీ సాయమేమి
లేక నినుఁ ద్రోటఁ గట్టఁ గల్గెనె రవంత?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 341

కడిఁదికార్చిచ్చు మ్రింగిన ఘనుఁడవీవు,
ధేనుకాసురుఁ జంపిన దిట్టవీవు,
శకటదైతేయు నదిమిన జాణవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 342

చారుయమునా స్రవంతికా సైకతముల
వల్లవార్భకసహపంక్తి నుల్లమలరఁ
జల్దిఁగుడుచు నీతీరు ముచ్చటను గొలుపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 343

నందగోకులమందు నానందమొప్ప
గొల్లపిల్లలతోడ నిల్లిల్లు నీవు
కొల్లగొట్టుగాథలు మాకుఁ గుతుకమొసఁగు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 344

భయదకాళియ పన్నగఫణములందు
భూచరులు ఖేచరులు మనోమోదమంద
నృత్యకేళీవినోదంబు నెఱపితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 345

నగ్నదేహలై యమునలో స్నానమాడు
గోపికల చీరలు హరించి గొప్ప తత్త్వ
బోధఁ జేసిన ధార్మిక మూర్తివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 346

కుండపోఁతగ వర్షంబుఁ గురియఁజేసి
గోకులము నాకులమొనర్చు గోత్రవైరి
యాటకట్టించినట్టి సాహసివినీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 347

విశ్వమోహనమైన నీ వేణురవము
వినితరించినయాభీరవనిత లుర్వి
నేమినోములు నోచిరో యెఱుఁగ నేను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 348

రమ్యబృందావనీ నాట్యరంగమందు
వ్రజవధూసహితుండవై రాసలీల
లభినయించిన నీమూర్తి నాత్మఁదలఁతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 349

చేరువకు వచ్చినట్టి యక్రూరు మెచ్చి
యమునలోఁ గృతస్నానుఁడౌనతని కెలమి
విశ్వరూపంబుఁ జూపిన వేల్పువీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 350

గంధమాల్యానులేపముల్ గౌరవముగ
నీ కొసంగి కుబ్జ, భవత్కృపాకటాక్ష
మునఁ ద్రిలోకసుందరిగ నీ మ్రోల నిలదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 351

కువలయాపీడగజరాజుఁ గుప్పఁగూల్చి
మహితబలశాలిఁ జాణూరు మట్టువెట్టి
బిరుదుమగఁడవై మధురలో వెలసితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 352

కఠినచిత్తునిఁ గంసునిఁ గసిమసంగి
తల్లిదండ్రుల ఘోరబంధములు వాపి
ద్వారకాపురి నేలిన స్వామివీవు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 353

మ్రుక్కడులు జరాసంధాదు లుక్కుమిగిలి
చివ్వకును నీపయినిఁగాలుద్రవ్వినపుడు
లీల వారి నోర్చిన శౌర్యశాలివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 354

రాక్షస వివాహమున రిపురాజినెల్ల
గడ్డి కఱపించి రుక్మిణీకన్యతోడ
విజయలక్ష్మిని జేకొన్న విభుఁడవీవు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 355

రాజసూయాధ్వరంబునఁ బ్రల్లదంబు
లాడిన శిశుపాలుని, జక్రహతునిఁ జేసి
ధర్మజార్ఘ్యంబుఁ గైకొన్న దైవమీవు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 356

దుస్ససేనుఁడు ధూర్తుఁడై ద్రుపదతనయ
వలువ లొలువంగ నక్షయవస్త్రకలితఁ
జేసి యామెమానంబు రక్షించితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 357

బాలసఖుఁడు కుచేలుఁడు భక్తిమీఱ
నటుకు లందింపఁ బ్రీతితో నారగించి
చిటికెలో వాని ధనవంతుఁ జేసితీవు!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 358

వీరశృంగారరసములు వెల్లివిరియ
నరిని వరుని మెప్పించు సత్యావధూటి
సమరకౌశల మెంచిన జాణవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 359

సత్యభామకు గర్వభంజనము సేయఁ
దులసియాకునఁ ద్రాసులోఁదూఁగి పరమ
భక్తసులభుండ వన్న పేర్వడసితీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 360

రాజరాజు విం దొసఁగఁ దిరస్కరించి
విదురు నాతిథ్యమునకు సమ్మదమునంది
భక్తవాత్సల్యమును స్పష్టపఱిచితీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 361

కౌరవులు నిన్నుఁ బేరోలగమునఁ బాశ
బద్ధుఁ జేయఁగా విశ్వరూపంబుఁ జూపి
వారి మౌర్ఖ్య మణఁచిన దైవంబవీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 362

పుట్టిగ్రుడ్డియౌ ధృతరాష్ట్ర భూధవునకుఁ
జూపు నొసఁగి భవద్విశ్వరూపదర్శ
నాప్తినొదవించినట్టి కృపాబ్ధివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 363

గాండివము చేయిజాఱె సంగరము సేయ
ననుచు నశ్రుసిక్తాక్షుఁడై యలమటించు
విజయునకు గీతఁగఱపిన వేల్పవీవు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 364

కొదమసింగంబు కుంభీంద్రుమద మడంప
నుఱుకురీతిఁ గురుక్షేత్రయుద్ధమందు
భీష్ముపై దూఁకు నీ మూర్తిఁ బ్రీతినెంతు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 365

ఆజిలో ధార్తరాష్ట్రుల నణఁగఁద్రొక్కి
వసుధకును యుధిష్ఠిరు సార్వభౌముఁజేసి
విశ్వసంక్షేమకర్తవై వెల్గితీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 366

అష్టభార్యలతోఁ బదునాఱువేల
గోపికలతోఁ బ్రణయకేళిఁ గుతుకమొప్ప
జరుపు నీదు రాసిక్య మాశ్చర్యకరము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 367

జయ విశుద్ధచైతన్యవిస్ఫారతేజ!
జయ యశోదాపురాపుణ్యసత్ఫలంబ!
జయ సమస్తలోకావనాసక్తచిత్త!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 368

జయ గభీరాబ్ధిగర్వభంజనమహాస్త్ర!
జయ వృషభనగవిహరణోత్సాహశీల!
జయ పయోరుహపత్రవిశాలనేత్ర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 369

* ♦ *

7. సామాజిక స్పృహ

బురదఁ బుట్టిన తామరపూవు నీదు
పూజ కర్హమగుట లేదె? పుడమిలోన
గుణమె కాని కులమును బేర్కొనఁగరాదు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 370

హీనవంశసంభవయై యహీనమహిమ
సతులలోనరుంధతి సమున్నతినిఁ గాంచె
కులముగా దుర్వి నెంచంగ గుణమెకాని
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 371

బోయవాఁడైన నేకలవ్యుండు తొల్లి
మేటి విలుకాఁడుగాఁ గ్రిడి మించలేదె?
గురుఁడు కోర నంగుష్ఠంబుఁ గోసియీఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 372

గుండె పిండు కవితలు కోకొల్ల లల్లి
తెలుఁగుజగతికి ఘనకీర్తిఁ దెచ్చినట్టి
జాషువా కవీంద్రుఁడు హరిజనుఁడుగాఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 373

భవ్యభారతరాజ్యాంగభవనశిల్పి
న్యాయశాస్త్రకోవిదుఁడు మహామనీషి
సచివుఁ డంబేత్కరుఁడు హరిజనుఁడుగాఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 374

సేతుశీతాద్రిపర్యంతభూతధాత్రి
ఖ్యాతిఁ గన్నట్టి యాది శంకరుని కెవఁడు
సర్వజనసమానత్వంబుఁ జాటిచెప్పె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 375

యుగయుగంబులనుండి యీ యుర్విలోన
రక్తదాహముఁ బెంచు వర్ణవ్యవస్థ
నడుపులోఁ బెట్టఁ గల్గు నాయకుని నిమ్ము;
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 376

పుట్టగొడుగులవంటి యీ పుట్టువులకు
సార్థకతఁజూపు లేనిచో సమసిపోవె?
కాలిన పెనంబుపై నీటికణములట్లు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 377

అహము తలకెక్కి పేదల నహరహంబు
ఘోర హింసల పాల్సేయు కుజనకోటి
గుండెలకు బల్లెమై నిలుచుండరాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 378

పదవికై చేయరానట్టి పనులుచేసి
నీతి సూత్రాలు గోతిలోఁ బాతిపెట్టు
నేతలను దగురీతి దండింప రమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 379

గోముఖవ్యాఘ్రముల్ తడిగుడ్డతోడ
గొంతుఁగోసెడి తుచ్ఛులగుంపునుండి
బ్రతికి బట్టకట్టఁగ మాకు గతిని జూపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 380

సరకులను దాఁచి నల్లబజారులందు
నిష్టమైన ధరకు విక్రయించునట్టి
మోతుబరి వర్తకుల పుట్టి ముంపరమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 381

అత్తయు నొకింటి కోడలేయనెడు సూక్తిఁ
ద్రోసిరాజని కోడండ్ర గాసిపెట్టు
పెంకియత్తలకును గనువిప్పునొసఁగు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 382

సంఘవిద్రోహ శక్తులు జాతినెల్ల
నల్లకల్లోల మొనరించి తల్లడిల్లఁ
జేయుచుండఁగ దగఁదుపేక్షింప నీకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 383

ఎల్లమతముల సారాంశ మేర్పడంగ
దేవుఁ డొక్కఁడే యని తెల్పఁ దెలివిమాలి
జనులు కొట్లాటలకు దిగజాఱఁ దగునె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 384

పూఁటు కొకపక్షము వహించి "ఓటు" కొఱకుఁ
గల్లబొల్లి మాటలతోడఁ గప్పదాఁట్లు
వేయు నాయకమ్మన్యుల పీఁచ మణఁపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 385

కాలమానపరిస్థితుల్ గలసిరాక
బుద్ధిమంతులు పలుపాట్లు పొందుచుండఁ
బట్టనట్లుండుటది నీకు భావ్యమౌనె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 386

కులమతంబులు రెండు నరులను నేఁడు
పట్టిపల్లార్చు వ్యాధులై ప్రబలుచుండ
మంచి వెజ్జవై వానిని మాన్పుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 387

ప్రతిసమస్యను నేర్పుగా రాజకీయ
ముగ మలంచి లబ్ధినిబొంది మురియునట్టి
స్వార్థపరశక్తులకు గుదిబండవగుము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 388

నశ్వరంబగుదేహంబు నమ్మి దాని
కూడిగముఁ జేసి భవదంఘ్రియుగ్మ సేవఁ
బడయని కుమతి జీవచ్ఛవంబ కాఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 389

సదవగాహనలేని సంసారమందుఁ
గీచులాటలు తఱచుగా లేచు గాన
దంపతుల మధ్య సఖ్యంబు నింపు మభవ!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 390

మంచితన మన్న దెన్నఁడో మంటఁగలిసె
కరడు గట్టిన నిర్దయ కదనుఁద్రొక్కె
బడుగువర్గాల బ్రదుకు లెప్పగిదిఁ గడచు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 391

పెను సమస్యలు సృష్టించి మనుజ జీవి
తాలతోఁ బరిహాసంబు లేలనీకు?
సుంత దయఁ జూపి వారల వంతఁదీర్పు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 392

మనుగడయె లేని పంగ్వంధజనులు శోక
వారిధి మునిఁగి యల్లాడ వారి నేల
సాఁకరావు నీ కారుణ్యనౌకతోడ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 393

ఆలి తెచ్చిన కట్నంబు చాలదనుచు
అత్తవారిల్లు గుల్లఁ జేయంగఁజూచు
మూర్ఖజామాతలకు నీవు బుద్ధిఁ గఱపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 394

కట్నమందాశ పెరిఁగి లోకంబులోన
కన్నియల బ్రతుకులు వల్లకాఁడులయ్యె;
ఏల పాప మీ దురవస్థ? జాలిలేదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 395

కాలమే పరిష్కార మార్గమ్ము నమ్ము
దేనికైనను; మనుజుఁడు దీక్షఁబూని
దూరదృష్టి గమింపఁ జేకూరు సుఖము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 396

సరసకావ్యంబు ప్రియసుహృద్వరునిరీతి
యాపదల సహకారంబుఁజూపి, యాత్మ
ధృతిని బెంచి నరుని సరిదిద్దుఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 397

చేఁదుతీపుల కలయికే జీవితంబు
పతియు సతియు వాగర్థసంబంధమూని
వరలిన బ్రతుకు బంగారుబాట కాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 398

జననమరణముల్ సుఖదుఃఖసముదయంబు
సృష్టి జీవకోటికిఁ గల్గఁజేసినీవు
అలఁతి నవ్వుచిందించు రహస్యమేమి?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 399

శ్రద్ధగాఁ గవిత్వమువిని సద్విమర్శ
సేయు సహృదయ శ్రోతలు క్షితిని నేఁడు
నామమాత్రావశిష్టులైనారు సామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 400

ఆత్మవిశ్వాస మసదుగా నలమటించు
యువత కుత్తేజ మిచ్చి చేయూఁతనొసఁగి
కార్యశూరులఁ జేయు మవార్యచరిత!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 401

8 దశావతార వర్ణనము

ద్రుహిణుఁగను బ్రామి వేదముల్ దొంగిలించి
జలధి దాఁగిన సోమకుఁ జంపినట్టి
మత్స్యరూపావతార! యో మహితచరిత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 402

దేవదానవుల్ దుగ్ధాబ్ధి దీక్షతోడఁ
ద్రచ్చఁ గ్రుంకిన తరిగొండఁ దత్క్షణంబ
నోర్మితోమేనఁ దాల్చిన కూర్మరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 403

అసురవల్లభుఁ డా హిరణ్యాక్షుఁ డుర్వి
నొడిసిపట్టి వార్ధిని ముంపనున్న తటిని
కోరయంచున నిల్పిన క్రోడరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 404

ఇందుఁ గలఁడందు లేఁడను సందియమ్ము
వలదు హరిపట్ల నను పట్టిపైని గనలు
హేమకశిపునిఁ జీల్చిన నృహరిరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 405

బలిసురారాతినుండి త్రిపాదధరణి
దానముగఁ బొంది భూనభోంతరము నిండి
కరుణ నాతనిఁ గాచిన ఖర్వరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 406

అలిగి ముయ్యేడు మాఱుల నవనిపతుల
కంఠములు ద్రుంచి, మాతృశోకంబుఁదీర్చి
ప్రతిన నిల్పుకొన్న పరశురామరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 407

చెనఁటి దశకంఠు శిరములు క్షితిని రాల్చి
సతిని సీతనుగొని జగద్ధితముఁగోరి
రాజ్యమేలినయట్టి శ్రీరామరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 408

గీత బోధించి క్రీడి సంప్రీతుఁజేసి
రిపుసమూహము నని లోనఁ ద్రెళ్లజేసి
కీర్తనీయుఁడవైన శ్రీకృష్ణరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 409

సత్యధర్మదయాశౌచసద్గుణాళి
నేల నాలుగుచెఱగుల నింపినట్టి
భూతకారుణ్యపరతంత్ర! బుద్ధరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 410

దుష్కరులు చెలరేఁగి సామూహికముగ
ఘోరహత్య లొనర్ప నాక్రోశమందు
కాందిశీకులఁ గాచిన కల్కిరూప!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 411

9 కృతికర్తృ విషయాదికము

పూజ్యపాదుఁడు బమ్మెరపోతరాజు
సత్కవియె నాకు మార్గదర్శకుఁడుగాఁగ
భవజలధి దాఁటు నీకృతి వ్రాసినాఁడ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 412

రామపాదతీర్థంబుగాఁ బ్రథితికెక్కి
విమల గౌతమీ నిమ్నగోపేతమైన
భవ్య ధవళేశ్వరగ్రామవాసి నేను
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 413

శ్రీయగస్త్యేశ్వరస్వామి, శ్రీజనార్ద
నుండు శ్రీవాయుసుతుఁడు కొల్వుండియుచట
శ్రేయములొసంగి ప్రజను రక్షించుచుంద్రు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 414

గ్రామదేవతగాఁ బేరుగన్న శ్రిత జ
నావనాసక్త హృదయ ముత్యాలతల్లి
చలువదీవెన లందు బిడ్డలము మేము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 415

స్వామి సుందరచైతన్యసంయమీంద్ర
జలదగంభీరకంఠనిస్వానలహరిఁ
జెన్ను మీఱు మహత్తరక్షేత్రమిద్ధి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 416

"శ్రీనికేతన" మనుపేరఁ జెలువుమిగిలి
హృదయసమ్మోదమొసఁగు నా సదనమందు
శ్రీద్వితీయుఁడవై నివసింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 417

ఖ్యాతిఁగన్న మెండా వంశమందునేను
వెంకయమ్మ సత్యములకుఁ బ్రియతనూభ
వుండనై యొప్పి నీకు భక్తుండ నైతి,
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 418

నాదు సహధర్మచారిణి నమ్రచరిత
రాజరత్నాఖ్య నీభక్తురాలు ప్రోత్స
హింప నీ చతుశ్శతి రచియించి నాఁడ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 419

నన్ను "చిన్నసీతారామ" నాము; సరస
సాహితీస్వర్ణసౌధాగ్రసంచరిష్ణు
గూర్మిమెచ్చి యీ కృతినిఁ గైకొమ్ము స్వామి!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 420

అమలవేదాంతవీథీవిహారు నిన్ను
సాహసించి వర్ణింప నుత్సాహపడితి
నెరసులున్న వత్సలత మన్నింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 421

10 ఫలశ్రుతి

నాదుశతకంబు పండితామోదమంది
పాఠకమహాశయులకు సద్భక్తిఁ గలపి
క్షితిని విశ్రుతిఁ గనునట్లు సేయుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 422

సావధానులై యీ చతుశ్శతిని నాల
కించుదాసజనులఁ గటాక్షించి నీవు
కర్మబంధముల్ తొలఁగించి కావుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 423

శుద్ధచేతస్కులై దీని శ్రద్ధతోడ
నహరహము పఠించెడి సుకృతాత్ములకును
దివ్యకైవల్యమును బ్రసాదింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 424


కేవలము భవన్నామసంకీర్తనంబు
సేయు పామరజనుల వాంఛితములెల్లఁ
ద్వరితగతిఁ దీర్చి వారికి శరణమగుము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 425

భువిని బ్రజలెల్లరును మూఁడుపూవు లాఱు
కాయలుగ మహాభ్యుదయంబుఁ గాంచవలయు
నాయురారోగ్య సుఖశాంతు లందవలయు
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 426

మంగళము నీకు నవరత్నమయకిరీట!
మంగళము నీకు మృగమదసంగతాంగ!
మంగళము నీకు సర్వసంపత్ప్రదాత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 427

హరిః ఓం తత్ సత్

కృతికర్త సంగ్రహ పరిచయము



నామధేయము	:-	చిన సీతారామయ్య
వంశనామము	:-	మెండా
జననము	:-	10-11-1933
అభిజనము	:-	పావన గోదావరీ నదీ తీరస్థమైన ధవళేశ్వరగ్రామము
జననీ జనకులు	:-	శ్రీమతి వెంకాయమ్మ, శ్రీసత్యంలు
సహధర్మచారిణి	:-	శ్రీమతి రాజరత్నం
అభ్యస్త విద్య	:-	ఎమ్.ఏ. (తెలుగు)
ఉద్యోగ వివరములు	:-	1958 నుండి 1991 వఱకు రాజమహేంద్రవరము, తణుకు మున్నగు పట్టణములందలి ప్రభుత్వ కళాశాలలందు ఆంధ్రోపన్యాసకత్వము. 1991 నవంబరులో పదవీ విరమణము
అభిరుచులు	:-	కవితావ్యాసంగము సారస్వతానుశీలనము ఆధ్యాత్మిక చింతనము.
ముద్రిత కృతులు	:-	తేనెవాకఁలు (1955) శ్రీ వేంకటేశ సుప్రభాతము (ఆంధ్రపద్యతాత్పర్యసహితము 1980)

